తెలుగు మాసపత్రిక
రూ.25/-
పేజీలు : 52

# కమలవాణి
# KAMALAVANI

సంపుటి : 26  సంచిక: 10 అక్టోబరు 2025



## ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు

● కర్నూలు సభలో ప్రధాని నరేంద్రమోడీ




● ప్రధాని మోడీ చేతుల మీదుగా
రూ.13,480 కోట్లతో అభివృద్ధి పనులు,



● భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశం




ఢిల్లీలో జరిగిన దీపావళి సాంస్కృతిక కార్యక్రమంలో
పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

# భాజపా మీడియా ప్యానెలిస్ట్‌లు

## ఆంధ్రప్రదేశ్ నుండి జాతీయ మీడియాకు మీడియా ప్యానెలిస్ట్‌లు

| క్ర.సం. | పేరు | జిల్లా | క్ర.సం. | పేరు | జిల్లా |
|---|---|---|---|---|---|
| 1 | శ్రీ సుధీష్ రాంభట్ల | బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ | 4 | శ్రీమతి ముళ్ళపూడి రేణుక | పశ్చిమ గోదావరి |
| 2 | శ్రీ లంకా దినకర్ | ప్రకాశం | 5 | శ్రీమతి సాదినేని యామిని శర్మ | ఎన్టీఆర్ |
| 3 | శ్రీ కనుమూరు రవిచంద్ర రెడ్డి | నెల్లూరు | 6 | డా. వినుషా రెడ్డి | కర్నూలు |

## రాష్ట్రస్థాయి మీడియా ప్యానెలిస్ట్‌లు

| క్ర.సం. | పేరు | జిల్లా | క్ర.సం. | పేరు | జిల్లా |
|---|---|---|---|---|---|
| 1 | శ్రీ కె. ఎన్. పి. చక్రవర్తి | విశాఖపట్నం | 11 | శ్రీ ఎం. బాలకృష్ణ యాదవ్ | కడప |
| 2 | శ్రీ కర్నాటి ఆంజనేయ రెడ్డి | నెల్లూరు | 12 | శ్రీమతి గాలి పుష్పలత | తిరుపతి |
| 3 | శ్రీ ఎం. ఎస్. పార్థ సారథి | సత్యసాయి | 13 | శ్రీ నరిశెట్టి ఆదిశేషు | ఎన్టీఆర్ (విజయవాడ) |
| 4 | శ్రీ దుద్దకుంట వెంకటేశ్వర రెడ్డి | అనంతపురం | 14 | శ్రీ చిన్నపురెడ్డి రవీంద్ర రెడ్డి | ఎన్టీఆర్ (విజయవాడ) |
| 5 | శ్రీ ఉన్నమట్ల కబర్ధి | పశ్చిమ గోదావరి | 15 | శ్రీమతి చాగర్లమూడి గాయత్రి | ఎన్టీఆర్ (విజయవాడ) |
| 6 | శ్రీ ఎర్ల శ్రీరామ్ మూర్తి | అనకాపల్లి | 16 | డా. ఇంటి ఆదినారాయణ | నంద్యాల |
| 7 | శ్రీ చిదిపోతు యశ్వంత్ కుమార్ | గుంటూరు | 17 | శ్రీ కె. నర్సింగ రావు | విశాఖపట్నం |
| 8 | శ్రీ తడువాయి నాగ రామకృష్ణ | గుంటూరు | 18 | డా. కొడిగంటి శ్రీధర్ | తిరుపతి |
| 9 | డా. ఏలూరి రామచంద్ర రెడ్డి | ప్రకాశం | 19 | శ్రీ పోతిరెడ్డి కృష్ణకాంత్ నాయుడు | కృష్ణ |
| 10 | శ్రీ యార్లగడ్డ రామ్ కుమార్ | కాకినాడ | | | |

తెలుగు మాసపత్రిక

# కమలవాణి

KAMALAVANI

సంపుటి : 26 సంచిక : 10 అక్టోబరు 2025

## లోపలి పేజీల్లో


- మోడీ సహకారంతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి 4
- మోడీ ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్ర సందర్శన 10
- మోదీ.. జన సునామీ 14
- ప్రధాని మోడీ ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు 16
- స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే సమన్వయమే లక్ష్యం 18
- రాష్ట్రాభివృద్ధికి అండగా కేంద్రం 20
- సంస్కృతి, సంప్రదాయాలకు జవసత్వాలు 22
- ముస్లింలకు మేలుచేసిన పార్టీ భాజపానే 26
- జీఎస్టీ సంస్కరణలతో భారత వృద్ధి వేగవంతం 28
- హైందవ ధర్మ పరిరక్షణలో కీలకం 30
- ఉగ్రవాదంపై సమిష్టి పోరాటం అవసరం 32
- సంప్రదాయానికి నవీన ఆవిష్కరణలు తోడైతే 36
- వికసిత్ భారత్‌కు బాటలు వేస్తున్న స్వావలంబన 38
- రైతుల నైపుణ్యాలకు పదును 40
- ఆరోగ్య సంరక్షణలో కొత్త శకం 42
- భారతీయ దృష్టికోణంలో ఆర్థికాభివృద్ధి మార్గం 44
- అక్రమార్జన, చీకటి జీవోలే జగన్ చరిత్ర 46
- బీసీల్లో నకిలీలకు చెక్ పెట్టేందుకే కులగణన 47
- పప్పుధాన్యాల స్వయం సమృద్ధికి 48
- కర్మయోగి పటేల్ 50
- విజయవాడ ఉత్సవ్‌తో కళాకారులకు గుర్తింపు 52


మీ వార్తలు, సంబంధిత ఫొటోలు, ఫొటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా మెయిల్‌లో కూడా కమలవాణికి పంపించవచ్చు. మీరు పంపాల్సిన చిరునామా ఈ మెయిల్
Kamalavani 2017@ gmail.com

Published and Printed by
NUKALA MADHUKAR on behalf of Bharateeya Janata Party and Printed at Kala Jyoti Process Pvt Ltd, Nidumukkala village, Tadikonda mandal,GUNTUR - 522016. A.P. Editor : VAMARAJU SREE SATYA MURTY Phone: 0866-2441135

Vulluri Gangadhar, Associate Editor,
Ch.Srinivas, Sub Editor

## సంపాదకీయం

### ఆంధ్రప్రదేశ్‌కు మోడీ శ్రీరామరక్ష

భారత ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అందిస్తున్న అపారమైన సహకారం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వేగవంతం చేస్తోంది. ఈ సహకారం రాష్ట్రానికి శ్రీరామరక్ష వంటిది. అన్ని విపత్తుల నుంచి రక్షిస్తూ, భవిష్యత్తును బంగారు మార్గంలో నడిపిస్తోంది. భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ ఇటీవల పదాధికారుల సమావేశంలో పేర్కొన్నట్లు, కేంద్రం నుంచి రాష్ట్రానికి లక్షన్నర కోట్ల రూపాయల సాయం అందింది. ఇది డబుల్ ఇంజన్ ప్రభుత్వం, కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి - ఫలితమే. మోడీ సారథ్యంలో ఈ సహకారం రాష్ట్ర మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక వృద్ధికి ఊపిరి పోస్తోంది.

రాష్ట్రంలో శరవేగంగా సాగుతున్న కీలక ప్రాజెక్టులు మోడీ సహకారానికి నిదర్శనాలు. ముఖ్యంగా, గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడితో వేగవంతమవుతోంది. ఇది ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ఇంధన వనరుల కేంద్రంగా మారుస్తూ, పర్యావరణ పరిరక్షణతోపాటు భారీ ఉపాధి అవకాశాలు సృష్టిస్తుంది. అలాగే, విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి రూ. 11,444 కోట్ల నిధులు కేటాయించడం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి, కార్మికులకు ఇస్తున్న ప్రాధాన్యతను చాటుతోంది. ఇది ప్లాంట్‌పై నెలకొన్న అనిశ్చితిని తొలగించి, మరింత బలోపేతం చేస్తుంది.

విశాఖపట్నంను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ రావడం ఇందుకు చిహ్నం. మోడీ నేతృత్వంలో ప్రాజెక్టులను ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చింది. అనేక ఐటీ సంస్థలు విశాఖకు వస్తున్నాయి. ఇది యువతకు రాబోయే ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు అందిస్తుందనే హామీని నిజం చేస్తుంది. ఈ వేగవంతమైన అభివృద్ధి పక్క రాష్ట్రాలైన కర్ణాటక వంటి వాటికి కంటగింపుగా మారింది, ఇది మన రాష్ట్రం సాధిస్తున్న వేగాన్ని సూచిస్తుంది.

మోడీ సహకారం లేకుండా ఈ అభివృద్ధి సాధ్యమా? కాదు. ఇది భాజపా సిద్ధాంతాలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగులు వేస్తున్నందున, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఉజ్వలమైంది. మోడీ సహకారం - రాష్ట్రానికి శ్రీరామరక్ష!

# మోడీ సహకారంతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి



## కర్నూలులో ప్రధాని మోడీ బహిరంగ సభ

భారత దేశ సామర్థ్యం ప్రపంచం గుర్తించిందని ఇప్పుడు భారత్‌ను ఓ తయారీ కేంద్రంగా చూస్తోందని చూస్తోందని ప్రధాని శ్రీ నరేంద్రమోడీ పేర్కొన్నారు. దేశాభివృద్ధికి పునాది పడింది ఆత్మ నిర్భర్ భారత్‌తోనే అని ఆయన పేర్కొన్నారు. . 2047 కు వికసిత్ భారత్ లక్ష్యంగా ముందడుగు వేస్తు న్నామని, ఓకల్ ఫర్ లోకల్ పేరుతో ప్రజలు మన తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ అక్టోబరు 16న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో దాదాపు రూ. 13, 430 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, నిర్వహించి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ తొలుత అహోబిలంలోని నరసింహ స్వామితోపాటు మహానందిలోని శ్రీ మహానంశ్వర స్వామికి ప్రణామాలు అర్పించారు. అలాగే సకలజన సౌభాగ్యం ఆకాంక్షిస్తూ మంత్రాలయం లోని శ్రీ గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు కోరారు.

అనంతరం ఆయన “సౌరాష్ట్రే సోమనాథం చ శ్రీశైల మల్లికార్జునమ్” అనే ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రంలోని శ్లోకాన్ని పఠించారు. దేశంలోని 12 జ్యోతిర్లింగాలలో సోమనాథుడు, మల్లికార్జున స్వామి పేర్లు ఆదిలోనే సంయుక్తంగా కనిపిస్తాయని శ్రీ మోడీ వివరించారు. “సోమనాథుని పవిత్ర భూమి గుజరాత్‌లో జన్మించడం, విశ్వనాథుని పావన కాశీ నగరం నుంచి దేశ సేవ చేయడం, నేడు శ్రీశైల మల్లికార్జున స్వామి దివ్యాశీస్సులు



పొందడం నాకు దక్కిన భాగ్యం" అని భక్తిపూర్వకంగా వ్యాఖ్యానించారు. శ్రీశైలం ఆలయంలో పూజల అనంతరం ప్రధానమంత్రి శివాజీ స్ఫూర్తి కేంద్రంలో నివాళి అర్పించి, అటుపైన వేదిక నుంచే ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే అల్లమ ప్రభు, అక్క మహాదేవి వంటి పూజనీయ శైవ సాధువులకు వందనాలు అర్పించారు. ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి, శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు వంటి నాయకులకు నివాళి అర్పించారు.

ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావిస్తూ' "స్వాభిమానం, సంస్కృతికి పట్టుగొమ్మగానే కాకుండా శాస్త్ర విజ్ఞానం–ఆవిష్కరణలకూ కేంద్రంగా ఈ రాష్ట్రం వెలుగొందుతోంది" అని ప్రధానమంత్రి కొనియాడారు. రాష్ట్రానికి అపార సామర్థ్యం ఉందని, యువతరం ప్రతిభకు ఎల్లలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన దల్లా– సరైన దృక్కోణం, సమర్థ నాయకత్వం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఆ మేరకు ఇవాళ శ్రీ చంద్ర బాబు నాయుడు, శ్రీ పవన్ కల్యాణ్ వంటివారి దార్శనికత నాయకత్వం సహా కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతుకూడా రాష్ట్రానికి లభిస్తు న్నదని ప్రధానమంత్రి



అన్నారు.

ఆంధ్రప్రదేశ్ గత 16 నెలల నుంచి శరవేగంగా పురోగమిస్తున్నదని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యాన ప్రగతి పథంలో పరుగు తీస్తున్నదని అభివర్ణించారు. ఈ మేరకు సత్వరవృద్ధి దిశగా జాతీయ, రాష్ట్ర రాజధానులు ఢిల్లీ–అమరావతి సంయుక్తంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందడం తథ్యమని ప్రధాని చెప్పారు. ఈ ఘనత ప్రస్తుత 21వ శతాబ్దపు దేశానికి, 140 కోట్ల మంది పౌరులకే చెందుతుందని శ్రీ మోడీ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా విద్యుత్తు,






రైల్వేలు, రహదారులు సహా వాణిజ్య సంబంధిత అనేక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన, జాతికి అంకితం చేయడం గురించి ఆయన ప్రకటించారు. ఇవన్నీ రాష్ట్రవ్యాప్త అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు పారిశ్రామిక వృద్ధికి దోహదపడుతూ, జనజీవన సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయని చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టులతో కర్నూలు, పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలకు శుభాభినందనలు తెలిపారు.

దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో పయనించాలంటే ఇంధన భద్రత అవశ్యమని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా విద్యుత్ రంగంలో సుమారు రూ.3,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును ప్రారంభించామని తెలిపారు. దీనివల్ల దేశ ఇంధన సామర్థ్యం కూడా ఇనుమడిస్తుందని, ప్రస్తుత సత్వర అభివృద్ధి నేపథ్యంలో గతకాలపు దుస్థితిని విస్మరించరాదని ప్రజలకు సూచించారు. దేశంలో 11 ఏళ్లకిందట నేటి ప్రతిపక్ష కేంద్ర ప్రభుత్వ హయాంలో తలసరి విద్యుత్ వినియోగం 1,000 యూనిట్లకన్నా తక్కువేనని గుర్తుచేశారు. అలాగే దేశవ్యాప్తంగా విద్యుత్ రంగంలో సరఫరాకోత వంటి సవాళ్లు నిత్యం వేధించేవని శ్రీ మోడీ పేర్కొన్నారు. వేలాది గ్రామాలకు ప్రాథమికంగా విద్యుత్ స్తంభాలు కూడా ఉండేవి కావని చెప్పారు. అలాంటి దురవస్థ నుంచి నేడు కాలుష్య రహిత ఇంధనం నుంచి మొత్తం ఉత్పాదనదాకా అన్ని రంగాల్లోనూ భారత్ కొత్త రికార్డులను సృష్టిస్తోందని ఆయన వెల్లడించారు. ఇవాళ ప్రతి గ్రామానికీ విద్యుత్ సదుపాయం చేరువ కాగా, తలసరి వినియోగం 1,400 యూనిట్లకు పెరగడంతోపాటు పరిశ్రమలు-గృహాలకు విద్యుత్తు సరఫరాలో కొరత మాటే లేదని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

భారత్ ఇంధన విప్లవ విజయంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన కూడలిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. శ్రీకాకుళం నుంచి అంగుల్ దాకా సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్టును ప్రారంభించడాన్ని ఆయన ఉటంకించారు. దీనిద్వారా దాదాపు 15 లక్షల గృహాలకు గ్యాస్ సరఫరా అవుతుందని తెలిపారు. చిత్తూరులో రోజువారీగా 20 వేల సిలిండర్ల సామర్థ్యంతో ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్‌ను ఆయన ఇవాళ ప్రారంభించారు. ఈ సదుపాయం వల్ల స్థానిక రవాణా, నిల్వపరంగా ఉపాధి లభిస్తుందని, యువతకు కొత్త అవకాశాలు అందివస్తాయని పేర్కొన్నారు.

“దేశమంతటా బహుళ రవాణా మౌలిక సదుపాయాలు వేగంగా వృద్ధి చెందడంతోపాటు గ్రామాల నుంచి నగరాలకు, నగరాల నుంచి ఓడరేవుల





కు అనుసంధాన కల్పనపై మేం నిశితంగా దృష్టి సారించాం" అని ప్రధానమంత్రి చెప్పారు. ఇందులో భాగంగా సబ్బవరం-షీలానగర్ మధ్య నిర్మించిన కొత్త రహదారితో అనుసంధానం మరింత మెరుగవుతుందని ఆయన అన్నారు. రైల్వేలకు సంబంధించి కొత్త మార్గాల ప్రారంభం, రైలు ఫ్లైఓవర్ల నిర్మాణంతో నవశకం మొదలైందని పేర్కొన్నారు. తద్వారా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ఈ ప్రాంత పరిశ్రమలకు నవ్యోత్తేజం లభిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## కర్నూలు బహిరంగ సభ

దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందాలన్న లక్ష్యానికి ప్రభుత్వం, ప్రజానీకం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ సంకల్పాన్ని స్వర్ణాంధ్ర దార్శనికత మరింత శక్తిమంతం చేయగలదని ప్రధానమంత్రి అన్నారు. ఈ రాష్ట్రంతోపాటు యువతరంకూడా సాంకేతికంగా నిత్యం ముందంజ వేస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ మరింతగా పెంచుకుంటున్నాయని వ్యాఖ్యానించారు.



"వేగం, పరిమాణం రీత్యా భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ వైపు ప్రపంచం నేడు దృష్టి సారిస్తోంది" అని శ్రీ మోడీ ప్రకటించారు. రెండు రోజుల కిందట ఈ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు గూగుల్ ప్రకటించడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు భారత్‌లో తన తొలి కృత్రిమ మేధ (ఏఐ) కూడలిని ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు చేయబోతున్నదని వెల్లడించారు. తద్వారా శక్తిమంతమైన 'ఏఐ' మౌలిక సదుపాయాలు, విస్తృత డేటా సెంటర్ సామర్థ్యం, పెద్ద ఎత్తున ఇంధన వనరులు సహా విస్తృత ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తాయని ప్రధానమంత్రి వివరించారు.

గూగుల్ సంస్థ పెట్టుబడి పెట్టే 'ఏఐ' కూడలి ప్రాజెక్టులో కొత్త అంతర్జాతీయ 'సబ్‌సీ గేట్‌వే' (సముద్ర గర్భ కేబుల్ నెట్‌వర్క్) నిర్మాణం కూడా భాగంగా ఉంటుందని ప్రధానమంత్రి ప్రకటించారు. దీనిద్వారా విశాఖపట్నంలోని భారత తూర్పు తీరానికి బహుళ అంతర్జాతీయ 'సబ్‌సీ కేబుళ్లు' విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో విశాఖపట్నం 'ఏఐ'కి, అంతర్జాతీయ అనుసంధానానికి ప్రధాన కేంద్రం కాగలదని చెప్పారు. ఇది

దేశానికేగాక యావత్ ప్రపంచానికీ సేవలంది స్తుందని పేర్కొంటూ– ఈ ప్రాజెక్టు సాధనలో రాష్ట్రం విజయవంతం కావడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.



భారత ప్రగతికి ఆంధ్రప్రదేశ్ పురోగమనం అత్యంత అవశ్యమని, అదే తరహాలో రాష్ట్ర ప్రగతికి రాయలసీమ అభివృద్ధి ఎంతో ముఖ్యమని శ్రీ మోడీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు గడ్డపై నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లాలో ఉపాధి, శ్రేయస్సుకు కొత్త బాటలు వేస్తాయని, తద్వారా సీమలో పారిశ్రామిక వృద్ధి వేగం పుంజుకుంటుదని శ్రీ మోడీ స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగిరపరచే దిశగా కొత్త పారిశ్రామిక కారిడార్లు, కేంద్రాల ఏర్పాటు ఎంతైనా అవసరమని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఓర్వకల్, కొప్పర్తిని రాష్ట్రానికి కొత్త పారిశ్రామిక గుర్తింపు కేంద్రాలుగా ప్రభుత్వం రూపొందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో పెట్టుబడులు పెరుగుతూ నిరంతర కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని తెలిపారు.

"ప్రపంచం నేడు భారత్‌ను 21వ శతాబ్దపు కొత్త తయారీ కూడలిగా గుర్తిస్తోంది. స్వయం సమృద్ధ భారత్ దృక్కోణమే ఈ విజయానికి పునాది" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అలాగే ఈ దిశగా భారత్ ముందంజలో ఆంధ్రప్రదేశ్ కీలక సహకార శక్తిగా ఎదుగుతున్నదని వివరించారు. గత ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని నిర్లక్ష్యం చేశాయని, దీంతో మొత్తంగా దేశానికి ఎదురుదెబ్బ తగిలిందని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ ప్రగతికి సారథ్యం వహించగల రాష్ట్రం ఒకనాడు స్వీయాభివృద్ధి కోసం పోరాడాల్సిన దుస్థితిలో పడిందని వ్యాఖ్యానించారు. అయితే, తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉత్పాదక రంగం వేగంగా వృద్ధి సాధించిందని చెప్పారు. తద్వారా పురోగమన పథం కొత్త పుంతలు తొక్కుతున్నదని, ఇది తనకెంతో సంతృప్తినిస్తున్నదని తెలిపారు. నిమ్మకూరులో 'అడ్వాన్స్‌డ్ నైట్ విజన్' కర్మాగారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా ఇది మరో ముందడుగని, తద్వారా 'నైట్ విజన్ పరికరాలు, క్షిపణి సెన్సర్లు, డ్రోన్ రక్షణ వ్యవస్థల' ఉత్పాదనలో దేశ సామర్థ్యం ఇనుమ





డిస్తుందని తెలిపారు. అంతేగాక రక్షణ ఎగుమతులు ఉన్నత శిఖరాలకు చేరుతాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్వదేశీ ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను, సాధించిన విజయాలను యావత్ ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని ఆయన వ్యాఖ్యానించారు.

కర్నూలును భారతదేశ డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంకల్పం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి.. కర్నూలు, ఆంధ్ర అంతటా డ్రోన్ పరిశ్రమ నుంచి భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాలతో ముడిపడి ఉన్న అనేక

## కర్నూలు బహిరంగ సభ

కొత్త రంగాలు ఉద్భవిస్తాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో డ్రోన్ల ఉపయోగాన్ని ప్రస్తావించిన ప్రధాని.. రాబోయే సంవత్సరాల్లో డ్రోన్ల విభాగంలో కర్నూలు జాతీయ శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు జీవన సౌలభ్యాన్ని అందించేందుకు ఉద్దేశించిన సంస్కరణల గురించి మాట్లాడుతూ.. ప్రజా కేంద్రీకృత అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను పునరుద్ఘాటించారు. రూ. 12 లక్షల వరకు



ఆదాయానికి ఎలాంటి పన్ను లేదన్న ఆయన.. అందుబాటు ధరల్లో మందులు, తక్కువ ఖర్చుతో కూడిన ఆరోగ్య సంరక్షణ, వృద్ధుల కోసం ఆయుష్మాన్ కార్డులు వంటి కార్యక్రమాలు జీవన సౌలభ్యంలో కొత్త అధ్యాయానికి నాంది పలికాయని అన్నారు.

భారీగా తగ్గిన జీఎస్టీ రేట్లు నవరాత్రి మొదటి రోజు నుంచే అమల్లోకి వచ్చాయని ప్రధానమంత్రి అన్నారు. నారా లోకేష్ నేతృత్వంలో జీఎస్టీ బచత్ ఉత్సవాన్ని వీక్షించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. “సూపర్ జీఎస్టీ – సూపర్ పొదుపు” ప్రచారాన్ని విజయవంతంగా ప్రారంభించడం పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు రూ. 8,000 కోట్లకు పైగా ఆదా చేసుకోవటంతో పండుగ వాతావరణం మరింత మెరుగుపడిందని తెలిపారు. ‘వోకల్ ఫర్ లోకల్’కు అనుగుణంగా జీఎస్టీ పొదుపు పండుగను జరుపుకోవాలని ప్రధానమంత్రి కోరారు.

అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ ద్వారా వికసిత్ భారత్ అనే కల సాకారం అవుతుందని పేర్కొంటూ ఆయన ప్రసంగాన్ని ముగించారు. కొత్త ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రజలకు మరోసారి అభినందనలు తెలియజేశారు.




# మోడీ.... చత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్ర సందర్శన

ప్రధాని శ్రీ నరేంద్రమోడీ శ్రీశైలంలో పుణ్యక్షేత్రం లో అణువణువునూ తిలకించి తన్మయులైనారు. చత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ముందుగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని, అప్పటి తరహాలో నిర్మించిన దర్బార్ హాల్‌ను పరిశీలించారు. రాజదర్బార్లోని గోడలపై చత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్రకు సంబంధించిన శిల్పాలతో కూడిన చిత్రమాలికను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా అక్కడి శివాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ పక్కనే ఉన్న శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా సందర్శించారు. అక్కడ ధ్యానముద్రలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ, అమ్మ వారి విగ్రహాలను తిలకించారు. అక్కడ కూడా అమ్మవారి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పుష్పాలను సమర్పించారు. చత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్ర నిర్వహణ బాగుందని ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. చత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు శ్రీ టి.జి.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపి.సుబ్బారెడ్డి, క్షేత్ర ప్రచారక్ శ్రీఎస్. భరత్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీఎస్. నాగేశ్వరరావులు శ్రీశైలంలో శివాజీ మహారాజ్ యొక్క స్ఫూర్తి కేంద్రం నిర్మించిన విధానాన్ని వివరించారు. ఒకప్పుడు చత్రపతి శివాజీ మహారాజ్ ధ్యానం చేసిన స్థలంలో నిర్మించిన భవనంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 23 నిమిషాల పాటు మౌనంగా ధ్యానం చేయడం విశేషం. అనంతరం చత్రపతి శివాజీ టర్మినల్ నూతన భవనాలను ఆసక్తిగా తిలకించారు. ప్రధాని వెంట ముఖ్య మంత్రి శ్రీచంద్రబాబు నాయుడు ఉపముఖ్య మంత్రి శ్రీకొణిదెల పవన్ కళ్యాణ్



ఉన్నారు. శ్రీశైలం పర్యటనపై ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.



## శ్రీశైల క్షేత్రం శివాజీ అనుబంధం

1674లో శివాజీ మహారాజ్ యావత్ హిందూ సామ్రాజ్యాన్ని ఆవిష్కరించడానికి పట్టాభిషేకం జరిగింది. ఉత్తరాన ఔరంగజేబ్ దక్షిణాన కుతుబ్‌షాహీ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుండటాన్ని శివాజీ మహారాజ్ ఖండించి వారికి బుద్ధిచెప్పడానికి పూనుకున్నారు. దక్షిణ భారత దేశమంతా హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి కంకణం కట్టుకున్నారు. 1677లో శివాజీ మహారాజ్ శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. ఆనాడు భ్రమరాంబిక దేవి కోసం కఠోర దీక్ష చేశారు. కఠోర దీక్ష ఫలితంగా భ్రమరాంబికా దేవి ప్రత్యక్షమై ఒక ఖడ్గాన్ని శివాజీ మహారాజుకు కానుకగా ఇచ్చిందని చెబుతారు. ఇదే విషయాన్ని ప్రధానమంత్రి మోడీకి అధికారులు వివరించారు. శివాజీ మహారాజ్ ఈ ప్రాంతంలో ధ్యానం చేశారనడానికి ఉన్న ఆధారాల గురించి చెప్పారు.. ఈ ప్రాంతంలో శివాజీ మహారాజ్ పరిపాలన పరంగా దర్బారు కార్యకలాపాలు నిర్వహించారని, అందుకే 1975 సంవత్సరంలో ఈ స్థలాన్ని లీజుకు తీసుకుని, ఇక్కడ శివాజీ టెర్మినల్ రూపొందించామని వివరించారు. 1983 వ సంవత్సరంలో ఆనాటి మహారాష్ట్ర సీఎం వసంత దాదా పాటిల్ ఈ ప్రాంతానికి వచ్చి ధ్యాన మందిరానికి శంకుస్థాపన చేశారని ప్రధానికి వివరించారు. ఈ ధ్యాన మందిరాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా సందరించారన్నారు.





# మోడీ సహకారంతో రాష్ట్రాభివృద్ధి : చంద్రబాబు



మోడీ సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని, కేంద్రం, రాష్ట్రం లోని ఎన్డీఏ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌కు రెట్టింపు ప్రయోజనాలు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి శ్రీచంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్, బచత్ ఉత్సవ్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా దేశ ప్రగతి వేగాన్ని పెంచేందుకు ప్రధాని మోడీ కీలక నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. దేశ అభివృద్ధి కోసం కీలకమైన సంస్కరణలు తీసుకు వచ్చారని తద్వారా ప్రపంచ వ్యాప్తంగా భారత్ అగ్ర స్థానానికి చేరుకుంటోందన్నా రు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047కు దేశం సూపర్ పవర్ గా మారుతుందని చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సైనిక పరంగా భారతదేశ సత్తాను ప్రపంచానికి మోడీ చాటారని అభినందించారు. ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న అమెరికా టారిఫ్ లను ఎదు ర్కొనేందుకు ప్రధాని మోడీ ఇచ్చిన స్వదేశీ పిలుపే తారక మంత్రం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకూ చిప్‌ల నుంచి షిప్పుల వరకూ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెట్టుబడులు సాధిస్తోందని విశాఖలో ఆర్సెల్లార్ మిట్టల్, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా హబ్ వస్తోందని, నెల్లూరులో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ రిఫైనరీ వస్తోందని వెల్లడించారు. జీఎస్టీ 2.0తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని, అటు వ్యాపారులు, ఇటు ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు లబ్ధి కలిగించేలా సంస్కరణలు ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు త్వరలో హైకోర్టు బెంచ్ రాబోతోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కర్నూలు బెంచ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని.. తెలిపారు. రాయలసీమలో స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరో స్పేస్, ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటితో పాటు సెమీ కండక్టర్ యూనిట్, క్వాంటం వ్యాలీ రావడానికి కారణమైన ప్రధానికి మోదీకి సభా వేదిక నుంచి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

# డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌లా అభివృద్ధి : మంత్రి లోకేశ్

కేంద్రంలో మన నరేంద్రమోడీ సహకారంతో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్... డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌లా అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి శ్రీలోకేష్ పేర్కొన్నారు. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నామని, విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పోలవరం పనులు వేగవంతం అయ్యాయన్నారు. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలులో హై కోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారన్నారు. భారత్‌లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందన్నారు. గూగుల్, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ అని లోకేశ్ తెలిపారు. సూపర్ జిఎస్టీ –సూపర్ సేవింగ్స్ తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉందన్నారు.



# ఏపీకి సెమీ కండక్టర్ పరిశ్రమలు ' శ్రీనివాసవర్మ

కేంద్రంలో ప్రధాని మోడీ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బలమైన నాయకత్వంలో అభివృద్ధిలో ఏపీ ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి శ్రీభూ పతి రాజు శ్రీనివాసవర్మ చెప్పారు. రాష్ట్రానికి సెమీ కండక్టర్ లాంటి పరిశ్రమలు రాబోతు న్నాయన్నారు. కర్నూలుసభలో ఆయన ప్రసం గించారు."కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ప్రధాని మోదీ రాష్ట్రానికి నాలుగుసార్లు వచ్చారు. వచ్చిన ప్రతిసారి వేల కోట్ల రూపాయల జాతీయ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. విశాఖ పర్య టనలో రూ. 2 లక్షల కోట్లకుపైగా విలువైన జాతీయ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇప్ప టికే పలు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రాజ ధాని అమరావతి పునర్ని ర్మాణం కార్యక్ర మానికి హాజరైనపుడు ప్రధాని రూ. 58 వేల కోట్లు విలువైన ప్రా జెక్టులకు శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశారు. ఇప్పుడు కర్నూలుకు వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో రూ. 13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాప నలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలు ప్రాజెక్టులు జాతికి అంకితం చేశారు. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ పరిశ్రమకు నిధులు ఇచ్చిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుంది. ప్రపంచంలో 4వ ఆర్థిక శక్తిగా భారత్‌ను తీర్చిది ద్దిన వ్యక్తి మోడీ" అని పేర్కొన్నారు.



# ఏపీలో అభివృద్ధి పరుగులు - పవన్ కల్యాణ్




జీఎస్టీ 2.0 సంస్కరణతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజ నం కలుగుతుందని, విద్యా, వైద్యం ఖర్చుల భారం నుంచి ప్రజలకు ఊరట లభిస్తుందని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశా రు. ఆత్మ నిర్భర భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెట్టిన మోడీ కృషితో దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయ న్నారు. గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయని తెలిపారు. మోడీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను ముందుకు నడుపుతున్నారన్నారు. భావి తరానికి మార్గదర్శ నం చేస్తున్నారని, దేశం తలెత్తుకొనేలా ఆత్మ నిర్భర్ భారత్ తీసుకువచ్చారన్నారు. మన రాష్ట్రానికి విచ్చేసి రూ. 13 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టార న్నారు. ఒక్క ఓర్వకల్లు పారిశ్రామికవాడలోనే రూ. 4 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, పెట్టుబడులు రావాలంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండా లన్నారు. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ సయ్యద్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్, ఎంపీలు వేదికను అలంకరించగా భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీ మధుకర్‌జీ, ఎమ్మెల్యేలు పార్థసారథి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు, భాజపా, తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోదీ.. జన సునామీ



ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన జీఎస్టీ సభకు జనం సునామీలా తరలి వచ్చారు. దీంతో జీఎస్టీ సభ జనసంద్రాన్నే తలపించింది. లక్షలాది మంది తరలి రావడంతో సభా ప్రాంగణం నిండి పోయింది. నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో నిర్వహించిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ సభకు కోడుమూరు, కర్నూలు నియోజవకవర్గాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు లక్షలాది మంది పాల్గొన్నారు. కోడుమూరు మండలం లద్దగిరి, గోరంట్ల, వెంకటగిరి, చిల్లబండ, ఎర్రదొడ్డి, అమడగుంట్ల, అనుగొండ, ప్యాలకుర్తి, కొత్తూరు, వర్కూరు, ముడుమల గుర్తి, క్రిష్ణాపురం, కల్లపరి, పులకుర్తి గ్రామాల మహిళలు, రైతులు, యువత, చేనేత కార్మికులు పోటెత్తారు. భాజపా కర్నూలు జిల్లా అధ్యక్షులు అకమ్మతోట రామకృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ఆధ్వర్యంలో కార్యకర్తలు, భాజపా అభిమానులు, ప్రజలు ఉత్సాహంగా సమావేశానికి తరలివచ్చారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కు ఉదయం 10.30 గంటల నుంచే ప్రజల రాక ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకే సభా ప్రాంగణం నిండిపోవడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రవేశ మార్గాన్ని మూసేశారు. సభ ప్రారంభమైనప్పటి నుంచి 3.30 గంటల వరకు చిన్నటేకూరు, తడకనపల్లె మీదుగా నంద్యాల జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఓర్వకల్లు మీదుగా ఆర్టీసీ బస్సుల్లో బహిరంగ సభకు జనం తరలివచ్చారు. సభా ప్రాంగణంలో ఆశీనులైన వారు 1.50 లక్షల మంది వరకు ఉండగా.. ప్రాంగణం బయట, పార్కింగ్ ప్రదేశాల్లో సుమారు 50 వేల మందికి పైగా ఉన్నారు. మొత్తం 2 లక్షలకుపైగా తరలివచ్చి ఉంటారని అంచనా వేస్తు న్నారు. సభా ప్రాంగణం నిండిపోవడంతో చాలామంది బయట ఖాళీ ప్రదేశంలో నిల్చొని ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో లబ్ధి పొందినవారు చేతులెత్తాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరగా.. సభకు హాజరైనవారందరూ చేతులెత్తారు. దీనికి సీఎం స్పందించారు. తాను ఎన్నో సభలకు హాజరయ్యానుగానీ.. ఇంతమందిని చూడలేదని కితాబిచ్చారు. శక్తి పీఠం. జ్యోతిర్లింగం ఒకేచోట కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తుచేశా–రు. అలాంటిచోట ప్రధాని ప్రార్థనలు చేశారంటే అక్కడి శక్తి ఏమిటో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జీఎస్టీపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలతో ఉన్న పుస్తకాన్ని ప్రధానికి బహూకరించే సమయంలో పక్కనే ఉన్న మంత్రి లోకేశ్‌ను ప్రధాని దగ్గరికి రావాలని సూచించారు. లోకేశ్ భుజం తట్టి గుడ్ అంటూ ప్రశంసించారు. కొద్ది సేపు లోకేశ్తో ప్రధాని ఆప్యాయంగా మాట్లాడడం సభికులను ఆకర్షించింది.

## ర్యాలీగా

మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లతో పాటు కేంద్ర మంత్రులు, కూటమి పార్టీల అధ్యక్షులతో ర్యాలీగా సభ వరకు చేరుకున్నారు. ర్యాలీ జగుతున్నంత సేపు.. జయహో అంటూ పాటకు సభలో ఉన్న ప్రజలు జెండాలు ఊపుతూ ప్రధానీ మోదీ స్వాగతం పలికారు. సాయంత్రం

4.10 గంటలకు సభ ముగుస్తున్నా బస్సులు సభాస్థలికి వస్తూ కలిపించాయి. ఆలూరు, ఆదోని, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల నుండి 4 గంటల తర్వాత కూడా బస్సులు రావడం గమనార్హం.

## పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు

ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల నుంచి వచ్చిన వాహనాలకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. నంద్యాలనుంచి వచ్చే వాహనాలు టోల్ గేటు దాటి రానీయకుండా అక్కడికక్కడే పార్కింగ్, కర్నూలు, కోడుమూరు, ఆదోని నుంచి వచ్చే ప్రజలకు ఇటువైపే పార్కింగ్ ఏర్పాటు చేసి సభలోకి వెళ్లేలా మార్గాలు ఏర్పాటు చేయడం, డోన్ వైపు నుంచి వచ్చే వారికి సభ వెనుక వైపు దారి ఏర్పాటు చేయడం, వీఐపీలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం విశేషం.

## అందుబాటులో ఆహారం..

సభ కోసం వచ్చే ప్రజల కోసం పార్కింగ్ ప్రదేశాల వద్ద, ప్రధాన మార్గాల వద్ద ఆహారం, మజ్జిగ, తాగునీరు అందించారు. మరో వైపు ప్రజలు బస్సు దిగిన వెంటనే అక్కడే ఆహార పొట్లాలు అందించారు.

## ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం..

ప్రధానమంత్రి పర్యటన, బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో సహా అధికారులంతా పదిహేను రోజులుగా ప్రణాళికతో వ్యవహరించడంతో సభ ప్రశాంతంగా ముగిసింది.

## అధికారుల చక్కని సమన్వయం

సభకు ఏర్పాట్లు చేయడంలో అధికారులు చక్కని సమన్వయంతో వ్యవహరించారు. దాదాపు 3వేల బస్సులు, వందలాది కార్లు, ద్విచక్ర వాహనాలకు వచ్చినా ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా వ్యవహరించారు. ఉన్నతాదికారుల ఆదేశాలతో 15 పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈ, వీఐపీ, వీవీఐపీల గ్యాలరీల్లోకి పంపే విషయంలో జాగ్రత్త వహించారు.

## భారీ పోలీసు బందోబస్తు

పోలీసు శాఖ సుమారు 8వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించకుండా ప్రజలతో సమన్వయంతో మెలగడం విశేషం. అడుగుకో పోలీసు చొప్పున ఉంటూ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ముగ్గురు ఐపీఎస్ అధికారులు పర్యవేక్షించారు. వాహనాలకు వచ్చినట్లుగా పార్కింగ్‌కు దారి చూపిస్తూ పోరాటం చేశారు.

## ప్రధానికి ఘన స్వాగతం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఓర్వకల్లు విమానాశ్రయంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం శ్రీచంద్రబాబు, కేంద్ర మంత్రులు శ్రీరామ్మోహన్ నాయుడు, శ్రీ భూపతిరాజు శ్రీనివాసరాజు, పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం శ్రీపవన్ కళ్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్, మంత్రి శ్రీ నారా లోకేశ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్, శ్రీ భరత్, ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ పార్థసారథితో పాటు కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 9.45 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. 10.19 గంటలకు శ్రీశైలానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఓర్వకల్లు సభ 4.33 గంటలకు నిమిషాలకు ముగించుకుని 4.52 గంటలకు ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.



# ప్రధాని మోడీ ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు




ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కొన్నింటిని జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులు పరిశ్రమలు, విద్యుత్ సరఫరా, రోడ్లు, రైల్వేలు, రక్షణ తయారీ, పెట్రోలియం, సహజ వాయువు వంటి కీలక రంగాలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పారిశ్రామికీకరణను వేగవంతం చేయడం, సమ్మిళిత సామాజిక-ఆర్థిక వృద్ధిని సాధించడం లక్ష్యంగా ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

## శంకుస్థాపనలు

## విద్యుత్ సరఫరా మెరుగుదల

కర్నూలు జిల్లాలోని కర్నూలు-3 పూలింగ్ స్టేషన్‌లో రూ. 2,880 కోట్లకు పైగా వ్యయంతో ఒక ప్రధాన విద్యుత్ సరఫరా ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టులో 765 కేవీ డబుల్-సర్క్యూట్ కర్నూలు-3 పూలింగ్ స్టేషన్ నుంచి చిలకలూరిపేట వరకు విద్యుత్ సరఫరా లైన్ నిర్మాణం ఉంటుంది. ఈ లైన్ విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని 6,000 ఎంపీఏలు పెంచుతుంది. ఈ ప్రాజెక్టు దేశంలో పునరుత్పాదక విద్యుత్ సరఫరాను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఇది శక్తి రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను మరింత స్వావలంబనగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో శక్తి అవసరాలను తీర్చడమే కాకుండా, జాతీయ విద్యుత్ గ్రిడ్‌కు బలాన్ని చేకూరుస్తుంది.



## పారిశ్రామిక కారిడార్లు

కర్నూలు జిల్లాలోని ఓర్వకల్, కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతాలకు రూ. 4,920 కోట్లకు పైగా వ్యయంతో శంకుస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టులను నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ), ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఈ పారిశ్రామిక కారిడార్లు వాక్-టు-వర్క్ పద్ధతిలో ఆధునిక, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలతో నిర్మితమవుతాయి. ఈ కేంద్రాలు వివిధ రంగాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తాయి. ఆవిష్కరణ ఆధారిత తయారీ కేంద్రాలుగా రూపొందుతాయి. ఈ ప్రాజెక్టులు రూ. 21,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, సుమారు 1 లక్ష ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని అంచనా. ఈ కారిడార్లు ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వృద్ధిని, ప్రపంచ పోటీతత్వాన్ని గణనీయంగా పెంచుతాయి.

## రోడ్డు రవాణా మౌలిక సదుపాయాలు

విశాఖపట్నంలో సబ్బవరం నుంచి షీలానగర్ వరకు రూ. 960 కోట్ల విలువైన 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి శంకుస్థాపన జరిగింది. ఈ రహదారి విశాఖపట్నంలో రద్దీని తగ్గించడంతో పాటు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలను పెంచుతుంది. ఈ రహదారి ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.



## ప్రారంభించిన ప్రాజెక్టులు రోడ్డు

## మౌలిక సదుపాయాలు

రూ. 1,140 కోట్ల విలువైన ఆరు రోడ్డు మౌలిక సదుపాయ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇందులో పీలేరు నుంచి కలూర్ వరకు (భాక్రాపేట వరకు) నాలుగు వరుసల రహదారి, కడప లేదా నెల్లూరు సరిహద్దు నుంచి సీఎస్ పురం వరకు వెడల్పు చేసిన రహదారి, గుడివాడ–మచిలీపట్నం ఎన్‌హెచ్–165 విభాగంలో గుడివాడ–నూజెల్ల రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు వరుసల ఆర్ఓబీ, ఎన్‌హెచ్–716లో పాపాగ్ని నదిపై నిర్మించిన భారీ వంతెన, ఎన్‌హెచ్–565లో కనిగిరి బైపాస్, ఎన్. గుండ్లప ల్లి పట్టణంలో ఎన్‌హెచ్–544 డీడీలో మెరుగైన బైపాస్‌లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు రహదారి భద్రతను మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం మరియు ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేస్తాయి.

## రైల్వే ప్రాజెక్టులు

రూ. 1,200 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన, అంకితం జరిగింది. కొత్తవలస–విజయనగరం నాలుగో రైల్వే లైన్, పెందుర్తి–ఉత్తర సింహాచలం మధ్య రైల్వే ఫ్లైఓవర్లకు శంకుస్థాపన జరిగింది. అలాగే, కొత్త వలస–బొడ్డవర, శిమిలిగూడ–గోరాపూర్ విభాగాల డబ్లింగ్‌ను జాతికి అం కితం చేశారు. ఈ రైల్వే ప్రాజెక్టులు రద్దీని తగ్గించడం, వేగవంతమైన, సు రక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించడం, సరకు రవాణాకు సౌలభ్యం కల్పించడం ద్వారా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక వృద్ధిని ప్రోత్సహిస్తా యి. అదనంగా, ఈ ప్రాజెక్టులు స్థానికులకు ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తాయి.

## ఇంధన రంగం

ఆంధ్రప్రదేశ్‌లో 124 కి.మీ, ఒడిశాలో 298 కి.మీ పొడవున్న శ్రీకాకుళం–అంగుల్ సహజ వాయువు పైప్‌లైన్‌ను గెయిల్ (ఇండియా) లిమిటెడ్ రూ. 1,730 కోట్లతో నిర్మించింది, దీనిని ప్రధానమంత్రి జాతికి అంకితం చేశా రు. ఈ పైప్‌లైన్ ఆంధ్రప్రదేశ్‌లో సహజ వాయువు సరఫరాను మెరుగు పరుస్తుంది. ఇది శక్తి రంగంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. అదనంగా, చిత్తూరులో ఇండియన్ ఆయిల్‌కు చెందిన 60 టీఎమ్‌టీపీఏ సామర్థ్యం గల ఎల్‌పీజీ బాట్లింగ్ కేంద్రాన్ని రూ. 200 కోట్లతో ప్రారంభిం చారు. ఈ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలు, తమిళనాడులోని రెండు జిల్లాలు, కర్ణాటకలోని ఒక జిల్లాలో 7.2 లక్షలకు పైగా వినియోగ దారులకు 80 పంపిణీదారుల ద్వారా సేవలను అందిస్తుంది. ఈ కేంద్రం గృహాలు మరియు వ్యాపార సంస్థలకు స్థిరమైన, విశ్వసనీయమైన ఎల్‌పీజీ సరఫరాను నిర్ధారిస్తుంది.

## రక్షణ తయారీ

కృష్ణా జిల్లాలోని నిమ్మకూరులో రూ. 362 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ (ఏఎన్‌వీపీఎల్)ను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశా రు. ఈ కర్మాగారం భారత రక్షణ దళాలకు అధునాతన ఎలక్ట్రో–ఆప్టికల్ వ్యవస్థలను తయారు చేస్తుంది. ఈ ఫ్యాక్టరీ రక్షణ తయారీలో స్వావలం బనను బలోపేతం చేయడంతో పాటు, స్థానికంగా నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టు భారతదేశ రక్షణ సామర్థ్యాలను మెరుగుపరచడంలో మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిం చడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడంలో కీలకమైనవి. విద్యుత్, రోడ్డు, రైల్వే, ఇంధనం, రక్షణ రంగాలలో ఈ ప్రాజెక్టులు రాష్ట్రాన్ని ప్రపంచ పోటీతత్వంలో ముందంజలో నిలిపేందుకు దోహదపడతాయి. అదనంగా, ఈ ప్రాజెక్టులు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరచడం ద్వారా రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతం చేస్తాయి.



# స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే సమన్వయమే లక్ష్యం



## భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశం

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాలతో పూర్తి సమన్వయంతో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ద్వారా ఎన్నికలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో జరిగిన భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో శ్రీ మాధవ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. స్థానిక ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి నిర్దిష్ట ప్రణాళికలను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాజపా 19 శాతం ఓటింగ్ సాధించిందని, ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో 27 శాతం ఓటింగ్ సాధించిన ఘనతను ఆయన గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పనిచేయాలని సూచించారు.

పార్టీని క్షేత్రస్థాయిలో క్రియాశీలం చేసేందుకు శ్రీ మాధవ్ కీలక కార్యాచరణను ప్రకటించారు. ఇందులో భాగంగా, నవంబర్ మొదటి వారంలో జిల్లా పదాధికారులు తప్పనిసరిగా ఎంపిక చేసిన ఒక మండలంలో ఒక రోజు పాటు పర్యటన చేయాలి. ఈ పర్యటన ద్వారా స్థానిక సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా, పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలకమైన గ్రామ స్థాయి కార్యకర్తలను చైతన్యవంతం చేసేందుకు నవంబర్ 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జోన్‌ల వారీగా ప్రత్యేక కార్యశాలలు (వర్క్‌షాప్‌లు) నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యశాలలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో పాటు, ఎన్నికల వ్యూహాలపై అవగాహన కల్పించనున్నాయి. రాబోయే రోజుల్లో భాజపా చేపట్టాల్సిన కార్యక్రమాలపై పదాధికారుల సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, నాలుగు ప్రధాన కార్యక్ర



మాలను నిర్వహించాలని నిర్ణయించారు.

**మనసులో మాట (మన్ కీ బాత్):** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతినెలా నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి, ముఖ్యంగా విద్యార్థుల్లోకి తీసుకెళ్లేందుకు 'మనసులో మాట' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. దీనికి అనుబంధంగా 'మన్ కీ బాత్ క్విజ్' పోటీలు కూడా నిర్వహించి యువతను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

**చేరువ:** కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అసంఖ్యాక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదారులకు ఆ పథకాలు అందేలా చూడటం లక్ష్యంగా 'చేరువ' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

**జనతా వారధి :** క్షేత్రస్థాయిలోని ప్రజాసమస్యలను గుర్తించి, వాటిని పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారుల దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు 'జనతా వారధి' పేరుతో ఒక వేదికను ఏర్పాటు చేయనున్నారు.

**మన జెండా.. మన వూరు:** పార్టీ సిద్ధాంతాలను, ఉనికిని ప్రతిబింబించేలా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భాజపా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను 'మన జెండా.. మన వూరు' పేరుతో పెద్ద ఎత్తున నిర్వహించాలని తీర్మానించారు.



## ఆదోని కైవసం.. అభినందన

ఇదే సమయంలో, కర్నూలు జిల్లా ఆదోని మండల పరిషత్‌ను భాజపా కైవసం చేసుకుందని మాధవ్ సగర్వంగా ప్రకటించారు. ఈ విజయానికి కారణమైన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ని సమావేశం తరపున ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించాలని కూడా సమావేశం నిర్ణయించింది. పార్టీ తరపున గెలిచిన ప్రజా ప్రతినిధులకు, జిల్లా పార్టీ ఇంఛార్జిల నియామకం కూడా త్వరలో చేపట్టనున్నట్లు మాధవ్ తెలిపారు.



## వైద్య కళాశాలలపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: సత్యకుమార్

ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు శ్రీ వై. సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య కళాశాలల ఏర్పాటు విధానంపై సమగ్రంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్ షిప్' విధానాన్ని ప్రోత్సహిస్తోందని, ఇదే విధానంలో రాష్ట్రానికి మెడికల్ సీట్లు పెరగడం వల్ల ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు, వైద్య రంగానికి జరిగే లాభాన్ని ఆయన వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మెడికల్ కాలేజీల ఏర్పాటుకు నయాపైసా ఖర్చు చేయకుండానే అన్నీ తామే చేశామని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపణలు చేయడాన్ని మంత్రి సత్యకుమార్ ఖండించారు. వైఎస్సార్‌సీపీ తమ హయాంలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తోందని ఆరోపించారు. వైసీపీ దుర్నీతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.

# రాష్ట్రాభివృద్ధికి అండగా కేంద్రం



## భాజపా రాష్ట్ర అధ్యక్షుల మీడియా సమావేశం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వం అండగా ఉందని, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశం సందర్భంగా ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ వై. సత్యకుమార్ యాదవ్ లతో కలసి మీడియాతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు లక్షన్నర కోట్ల రూపాయల సాయం అందించింది. ఈ నిధులు రాష్ట్రంలో వివిధ అభివృద్ధికార్యక్రమాలకు ఊతం ఇస్తాయి. అంతేకాకుండా, లక్షా ఎనభై వేల కోట్ల రూపాయల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి 11,444 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడ్డాయి, ఇది రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమకు బలాన్ని చేకూరుస్తుంది.

విశాఖపట్నం గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా రూపొందుతోంది. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్లు, అంటే సుమారు లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయల పెట్టుబడి విశాఖకు రాబోతోంది. ఇది డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక స్పష్టమైన చిహ్నం. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ గారి నాయకత్వంలో ఈ ప్రాజెక్టులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ అభివృద్ధి కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. అనేక ఐటీ సంస్థలు, కంపెనీలు విశాఖకు రావడం ద్వారా రాష్ట్రం పక్క రాష్ట్రాలైన కర్నాటకకు కంటగింపుగా మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వాలు దగాకోరు రాజకీయాలు చేస్తూ, తమ వైఫల్యాలను స్వయంగా బయటపెట్టుకుంటున్నాయి. కర్నాటకలో విఫలమైన ప్రభుత్వం ఉంది. అందుకే వారు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. కానీ, మోడీ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అసాధ్యమైన అంశాలను సాధించి, ప్రపంచ వ్యాప్తంగా మన రాష్ట్రం గురించి చర్చలు జరిగేలా చేసింది. విశాఖ కృత్రిమ మేధస్సు ప్రయోగాలకు కేంద్రంగా మారబోతోంది. మోడీ నాయకత్వంలో భారతదేశం 6 - G టెక్నాలజీ కేంద్రంగా రూపొందుతోంది, దీనికి గ్రీన్ ఎనర్జీ మద్దతుగా నిలుస్తుంది. సోలార్, విండ్, హై ఎనర్జీ వంటి వనరులను ఉపయోగించి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయబడుతుంది.

టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో యువతకు చైనా తర్వాత మన దేశంలోనే అత్యధిక అవకాశాలు ఉన్నాయి. అమెరికాలో ఆంక్షల కారణంగా, ఈ అవకాశాలు మన దేశంలోనే లభిస్తాయి. రాబోయే ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు అందుబాటులోకి వస్తాయి. వైజాగ్-చెన్నై, బెంగళూరు-చెన్నై, రాయలసీమ వైపు కారిడార్లు, డిఫెన్స్ క్లస్టర్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ ద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ఎలక్ట్రానిక్ వెహికల్ తయారీ కంపెనీలు, జిందాల్ సంస్థలు, పవర్ హౌస్‌లు ఏపీకి రాబోతున్నాయి.

మనరాజధాని అమరావతి గత ప్రభుత్వంలో నాశనం చేయబడింది. కానీ, మోడీ నాయకత్వంలో ఇప్పుడు అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయించారు.

అమరావతి నుంచి అనంతపురం వరకు జాతీయ రహదారుల అనుసంధానం జరగబోతోంది. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రం ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించింది. కుడి, ఎడమ కాలువల పనులు త్వరలో పూర్తి చేసి ప్రాజెక్టును సమయానికి ముగిస్తారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాయలసీమ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో, ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని కోరుతున్నాము. మన దేశ ఆర్థికాభివృద్ధికి ప్రజలంతా సహకారం అందించాలి. ఈ అభివృద్ధి ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయి.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రెస్ ఆంధ్రప్రదేశ్ : పురందేశ్వరి

ఎంపీ శ్రీ మతి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, గతంలో అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసే కలను నిజం చేయకుండా, మూడు రాజధానుల పేరుతో గతప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేసింది. కానీ, ఈ రోజు డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రజలు కూటమి



ప్రభుత్వానికి పట్టం కట్టడం ద్వారా ఈ అభివృద్ధి సాధ్యమని నమ్మకం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్ని విధాలుగా సహకారం అందిస్తోంది. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్రలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ, సమగ్ర అభివృద్ధికి పునాదులు వేసేలా మోడీ గారు నిధులను కేటాయిస్తున్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, రైల్వేలైన్లు వంటి మౌలిక సదుపాయాలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోంది. ఉదాహరణకు, విశాఖపట్టణంలో సీ కేబుల్స్ ద్వారా గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేంద్రం అనుమతులు సహకారం అందిస్తోంది. ఇలాంటి ప్రాజెక్టులకు అంతర్జాతీ య అనుమతులు అవసరం కాబట్టి, కేంద్రం యొక్క పాత్ర కీలకం.

మేక్ ఇన్ ఇండియా పాలసీలో భాగంగా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద సింగిల్ విండో విధానం ద్వారా పెట్టుబడులకు అనుమతులు సులభతరం చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పిస్తే, పెట్టుబడులు ఎక్కువగా ఆకర్షితమవుతాయి. కేంద్రం అందించే వెసులుబాటును రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సమర్థవంతంగా అందిపుచ్చుకుంటోంది. ఫలితంగా, అన్ని ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల సృష్టి సాధ్యమవుతోంది. అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా చూస్తూ, సమగ్ర అభివృద్ధిని సాధిస్తున్నాం. మోడీగారి నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయంగా గౌరవం పొందుతోంది. అనేక దేశాలకు మన దేశ ప్రతినిధులుగా వెళ్లినప్పుడు, భారత్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుతున్నారు. మహిళా సాధికారత, మహిళాభివృద్ధి విషయంలో భారత్ ముందంజలో ఉందని మేము గర్వంగా ప్రకటిస్తున్నాము. ఈ విజయంలో మోడీ గారి నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోంది. వికసిత్ భారత్‌తో పాటు, వికసిత్ ఆంధ్రప్రదేశ్ కూడా మన లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయి.

సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ వై. సత్య కుమార్ యాదవ్ కూడా పాల్గొన్నారు.

## భాజపా రాష్ట్ర పదాధికారుల సమావేశం

### నేతల సూచనలు.. అభినందనలు

సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీసోము వీర్రాజు మాట్లాడుతూ.. పార్టీ తరఫున సంచార జాతులు, అలాగే రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. కేంద్ర మంత్రి శ్రీభూపతిరాజు శ్రీనివాస వర్మ 'మన జెండా.. మన ఊరు' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో భాజపా జెండా ఆవిష్కరణలపై పలు కీలక సూచనలు చేశారు. ఎంపీ శ్రీపురందేశ్వరి పార్టీ బలోపేతంపై పలు సూచనలు అందించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ శ్రీలంకా దినకర్ రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పర్యటన నివేదికను ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్‌కు అందజేశారు. దినకర్ నివేదికను మాధవ్ వివరిస్తూ, ఆయనను అభినందించారు.

ఈ సమావేశంలో ఎంపీ శ్రీపాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యేలు డాక్టర్ శ్రీపార్థసారథి, శ్రీఎన్. ఈశ్వరరావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ శ్రీమతి జకియాఖానం, ఎమ్మెల్సీ శ్రీమతి పోతుల సునీత తదితరులు ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న తదితరులు పార్టీ సంస్థాగత విషయాలను ప్రస్తావించారు. రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్, చీఫ్ స్పోక్స్ పర్సన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యాలయం ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, గారపాటి తపన చౌదరి, బిట్రా శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మన సంస్కృతి, సంప్రదాయాలకు జవసత్వాలు : చంద్రబాబు



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విధానాలు రూపొందిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీనారా చంద్రబాబు నాయుడు అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి కార్యక్రమాల ద్వారా భారత్ అనేక రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కాక, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వదేశీ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు గాంధీ జయంతి సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన 'ఖాదీ సంత'ను సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధులతో కలిసి సందర్శించారు. ఈ సంతలో ఖాదీ, కలంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, ఇతర దేశీయ ఉత్పత్తుల స్టాళ్లను ఆయన పరిశీలించారు. స్వదేశీ పరిజ్ఞానంతో 4జీ సాంకేతికత అభివృద్ధిలో ప్రధాని మోడీ చొరవ అభినందనీయమని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అరకు కాఫీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన విజయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వదేశీ సంత గ్లోబల్ స్థాయికి ఎదగాలని, భారత్ ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే దిశగా ఒక ముందడుగని ఆయన విశ్వసించారు.

## స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇద్దాం : పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు

సంత అంటే చిన్నదైనా అది మనదనే అభిప్రాయం ఉంటుంది. సంతలో అన్ని కొనుక్కునేలా మన సంత మనకు తిరిగి రావాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 26 జిల్లాల్లో దీనిని నిర్వహిస్తున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆత్మనిర్బర్ భారత్ కార్య్యక్రమాన్ని కూడా ఈ రోజే ప్రారం భిస్తున్నాం. ఖాదీ సంతను అత్మనిర్బర్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నాం. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నుంచి వాజ్‌పేయి జయంతి 90 రోజుల పాటు దీనిని నిర్వహిస్తున్నాం. ప్రపంచ నాగరికతల్లో భారత్ మన వస్త్ర ఉత్పత్తుల ద్వారా ప్రత్యేక స్థానం పొందింది. ఆ ఖాదీనే



ఆయుధంగా చేసుకుని మనం స్వాతంత్ర్యం సాధించాం. 200 ఏళ్ల క్రితం ప్రపంచాన్ని శాసించిన చైనా, భారత్‌లు, ప్రపంచానికి భారీగా ఎగుమతులు చేసేవిగా ఉండేవి. కాని బ్రిటిషర్లు మనల్ని దోచుకోవడం వల్ల భారత్ ఎగుమతులు కేవలం 1.5 శాతం మాత్రమే ఉన్నాయి. మన వృత్తి కళాకారులను బ్రిటిషర్లు అణచివేశారు. మన పండగులు, భాష, సంస్కృతి, వంటలు అన్నీ శాస్త్రీయమైన వే. నవరాత్రులు స్వదేశీ సందేశాన్ని ఇస్తాయి. మనం పండుగులు వైభవోపేతంగా ఉంటాయి. మహాత్మాగాంధీ ఖాదీ ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించే ప్రయత్నం చేశారు. 1938లో కేవీ ఐసిని ఆయన ప్రారంభించారు. గ్రామస్వరాజ్యం, సర్వోదయం కోసం ఆయన ఆలోచన చేశారు. కాని స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాలు దీనిని వదిలేశారు. ప్రైవేటు వ్యాపారులు, పరిశ్రమలు రావడంతో గ్రామీణ పరిశ్రమలు వెనుకబడ్డాయి. ప్రధాని నరేంద్రమోడీ వచ్చాక మహాత్ముడి ఆశయాలను నెరవేర్చేలా స్వచ్ఛభారత్‌ను ముందుకు తీసుకెళ్లారు. దేశాన్ని పారిశ్రామిక అభివృద్ధి కోసం మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోవిడ్ మహమ్మారిపై దేశంలోని కంపెనీలు రెండు వాక్సిన్‌లు తయారుచేశాం. 140 కోట్ల మందికి వాక్సిన్‌లు ఇవ్వడంతో పాటు పలుదేశాలకు పంపిణీ చేశాం. స్వదేశీ అనే పథం ఇందులో ముడిపడి ఉంది. స్వయం



సమృద్ధి సాధించేలా నేడు మనం పలురంగాల ఉత్పత్తులను 38 శాతం మనం 24 వేల కోట్లు ఎగమతులు చేశాం. మన ప్రాంతంలో డిఫెన్స్ క్లష్టర్‌లు ఏర్పాటుచేస్తున్నాం. రాష్ట్రంలో రూ.4 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. అమెరికా సుంకాల ఆంక్షలు, చౌక ధరల పేరుతో చైనా మన మార్కెట్‌లను ముంచెత్తుతున్న నేపథ్యంలో మన ఉత్పత్తులను మనమే కొనుగోళ్లు చేసేలా స్వదేశీ ఉద్యమం చేయాలని మోడీ ఆకాంక్షించారు. స్వదేశీ ఉద్యమం మన రాష్ట్రం ఎంతో ఉపయోగపడాలి. ఏపీని వికసిత ఆంధ్రప్రదేశ్‌గా మనం మార్చాలి. మన రాష్ట్రంలో వందేళ్ల చరిత్ర ఉన్న వస్తువులు, ఖాదీ, వంటలను ప్రోత్సహించాలి. స్వదేశీ సనాతనం, నిత్యనూతనం. ఈ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్దాం. అని మాధవ్ వివరించారు.

## క్రీడాకారిణి సింధుకు అగ్గిపెట్టెలో చీర

అగ్గిపెట్టెలో పట్టేలా చేనేత కళాకారులు తయారు చేసిన చీరను ముఖ్యమంత్రి చంద్రబాబు, మాధవ్ చేతుల మీదుగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సింధుకు అందజేశారు. సమరయోధుడు పసల కృష్ణమూర్తి, అంజలి దంపతుల మనవరాలు భోగి రెడ్డి ఆదిలక్ష్మిని చంద్రబాబు, మాధవ్ సన్మానించారు. సభకు హాజ రైన వారితో దేశీయ వస్తువులనే ఉపయోగిస్తామని మాధవ్ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా శ్రీ చంద్రబాబు, శ్రీ మాధవ్ రాట్నంపై నూలు వడకడం ద్వారా స్వదేశీ సంప్రదాయానికి గౌరవం తెలిపారు.



# స్వదేశీ ఉత్పత్తులతోనే స్వయం సమృద్ధి సాదిద్దాం



స్వాతంత్ర్య సమరంలో విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను వాడాలన్న ప్రధాని నరేంద్ర మోడీ నినాదాన్ని దేశ ప్రజల్లోకి తీసుకు వెళ్తామని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సేవా పక్షోత్సవాలను పురస్కరించుకుని, స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో విక్రమహాల్ నందు ఏర్పాటు చేసిన ఖాదీ మాల్ (ఖాదీ ఫర్ నేషన్–ఖాదీ ఫర్ ఫ్యాషన్) కార్యక్రమంలో మంత్రి కందుల దురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభిద్దాం, దేశంలో తయారయ్యే ఉత్పత్తులను స్థానికంగా తయారయ్యే వస్తువులను కొనుగోలు చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వం తోడ్పాటుతో చేనేత, ఖాదీ ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం, తద్వారా దానిపై ఆధారపడి బతుకుతున్న చేనేత కార్మికుల జీవితాలలో గణనీయమైన మార్పులను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



అనంతరం ఎమ్మెల్సీ శ్రీ సోమువీర్రాజు మాట్లాడుతూ దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాలతో మోడీ పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీ సోమువీర్రాజు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమ న్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, క్షత్రి య బాలసుబ్రహ్మణ్యసింగ్, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# స్వదేశీ ఉత్పత్తులతోనే స్వయం సమృద్ధి సాధిద్దాం



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్ విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఖాదీ సంతను కేంద్రమంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు. మందుగా మహాత్మా గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న సేవాపక్షోత్స వాల్లో భాగంగా బాపూజీ అభిలాషించిన స్వచ్ఛ భార త్, చేనేత, ఖాదీ, చేతి కళల సమృద్ధిపై ప్రజలలో అవగాహన కల్పించారు. చేనేతకారులను, హస్తక కాకారులను, సేంద్రియ ఉత్పత్తులను, స్థానిక వస్తువు లను, ఖద్దరు, నూలు వస్త్రాలను ప్రోత్సహించడానికి అక్టోబర్ 2,3 తేదీల నగరంలో ఖాదీ సంతను ఏర్పాటు చేసినందుకు అభినందనలు. మహిళలు, వీధివ్యాపారులు, వృద్ధులు, వివిధ వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి లబ్దిదారు లకు తెలియజేయడానికి ప్రభుత్వ శాఖల స్టాళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి ఈ సంతలో పాల్గొని, చేనేత, చేతివృత్తులు, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించి ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంలో భాగస్వా ములు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో భాజపా రాష్ట్ర కోశాధికారి ఎమ్ నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, భాజపా నగర అధ్యక్షు లు ఎన్ఎన్ఎన్ పరశురామరాజు, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, భాజపా జిల్లా మాజీ అధ్యక్షులు ఎం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేష్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులతోనే స్వయం సమృద్ధి సాధిద్దాం

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి శ్రీమురుగన్ పేర్కొన్నారు. తిరుపతి నగరం త్యాగ రాజ మండపంలో జరిగిన 'ఖాదీ సంత' ముగింపు కార్యక్రమంలో ఆయ న పాల్గొన్నా రు. 'ఈ వస్తువు మా ఊరుది' అని గొప్పగా చెప్పుకొనే పరిస్థితి రావాలన్నా రు. ఆ దిశగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిం చి మన పారిశ్రామిక వేత్తలు ఆర్థికంగా నిలదొక్కునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా లాంటి దేశాలు ఎన్ని అంక్షలు పెట్టినా భయపడే పరిస్థితి లేదన్నారు. అనం తరం ఆయన స్టాళ్లను సందర్శించారు. కళం కారి వస్త్రాలు, దారుశి ల్పాలు తదితరాలను పరిశీలించారు. హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఏపీజీబీసీ చైర్పర్సన్ సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, భాజాపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితరు లు పాల్గొన్నారు. కేంద్ర మంత్రిని గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు.



# ముస్లింలకు మేలుచేసిన పార్టీ భాజపానే




## మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ భాషా ప్రమాణ స్వీకారం

ముస్లిం సమాజంలో 80 శాతం ఉన్న పస్మాండ వర్గానికి నిజమైన ప్రాతినిధ్యం, అవకాశాల కల్పనకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షులు శ్రీ జమాల్ సిద్దిఖీ పేర్కొన్నారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీ సయ్యద్ భాషా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిద్దిఖీ, ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రీకృత కుటుంబ రాజకీయాలను అనుసరిస్తుందని, అయితే భాజపా ప్రజా కేంద్రీకృత విధానాలను అవలంబిస్తుందని ఆయన వివరించారు. సిద్దిఖీ మాట్లాడుతూ, రాష్ట్రంలో మైనారిటీ మోర్చా చేస్తున్న కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లో మైనారిటీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మద్దతుగా నిలిచేలా చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా, ముస్లిం మహిళలను రాజకీయాల్లోకి ప్రోత్సహించాలని, నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా 33% మహిళలకు రాజకీయ రిజర్వేషన్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. మైనారిటీ సమాజంలోని వివిధ వర్గాలు, ముఖ్యంగా పస్మాండ ముస్లింలు, సమాజంలో సమాన అవకాశాలు, గుర్తింపు పొందేలా భాజపా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. షేక్ బాజీ గతంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా చేసిన కృషిని సిద్దిఖీ ప్రశంసించారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ భాషా ఆధ్వర్యంలో మోర్చా పార్టీ అభివృద్ధికి కృషి చేయగలదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ,



గత ప్రభుత్వాలు మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయని, కానీ మోడీ ప్రభుత్వం వారి అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. మైనారిటీల పిల్లల విద్య, ఉపాధి, వివాహాల వంటి అంశాలకు సంబంధించి పలు సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్ర మాల ద్వారా మైనారిటీ సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక, సామాజిక సాధికారత లభిస్తోందని ఆయన తెలిపారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ శ్రీమతి జకియా ఖానం మాట్లాడుతూ, మైనా రిటీల అభివృద్ధికి ప్రధానమంత్రి మోడీ చేస్తున్న కృషిని కొనియాడారు. మైనారిటీ సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోందని, ఈ కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులను తీసుకొస్తున్నాయని ఆమె అన్నారు.

రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన శ్రీ సయ్యద్ భాషా మాట్లాడు తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తూ, భాజపా బలోపేతానికి, మైనారిటీ సమాజ అభివృద్ధికి అవిరా మ కృషి



చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో మైనారిటీలకు ఎక్కువ అవకాశాలు కల్పించేం దుకు తాను కట్టుబడి ఉన్నానని, ముఖ్యంగా పస్మాండ ముస్లిం సమాజ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్ర మం భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ షేక్ బాజీ పర్యవేక్షణలో జరిగింది.

కార్యక్రమంలో మైనారిటీ మోర్చా జాతీయ నాయకురాలు షబ్నం, భాజపా రాష్ట్ర ఉపాధ్య క్షులు బిట్ర శివన్నారాయణ, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, అధికార ప్రతినిధి యామినీ శర్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి, రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్‌రాజు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, సందిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ భాషాను మంత్రి సత్యకుమార్ యాదవ్, జమాల్ సిద్దిఖీ, షబ్నం సత్కరించారు.





# జీఎస్టీ సంస్కరణలతో భారత వృద్ధి వేగవంతం




## భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టుల ఒకరోజు వర్క్‌షాపు

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లడం ద్వారా పార్టీని విస్తరించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ సూచించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు ఒకరోజు వర్క్‌షాపు మంగళగిరిలోని హాయ్‌లాండ్‌లో అక్టోబరు 17న జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ మాధవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భాజపా కార్యక్రమాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ, 'ఆంధ్రప్రదేశ్‌కు రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. అనేక మంది పారిశ్రామిక వేత్తలు ఏపీకి వస్తున్నారు. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుంది. రానున్న రోజుల్లో ఏపీ గ్లోబల్ హబ్ మారబోతోంది' అన్నారు. ఇదంతా డబుల్ ఇంజన్ సర్కారుతోనే సాధ్యమైందనే విషయం ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన స్పష్టం చేశారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు సహారైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదార్లు, కేంద్ర విద్యా సంస్థలు, సంస్థలు ప్రధాని మోడీ నేతృత్వంలో ఏపీకి అందుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ పదకొండేళ్ల పాలనలో ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశంగా ఎదిగిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. భాజపా కార్యాలయాలను ప్రజా సమస్యలు పరిష్కార వేదికలుగా చేసే క్రమంలో అధికార ప్రతినిధుల పాత్రను స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, ఆయా అంశాలపై స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుందని ఆయన చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచన మేరకు స్వదేశీ ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. నేటి తరానికి



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ ఎస్) చారిత్రక నేపథ్యం వివరించడంతో పాటు సంఘ్పు బురదజల్లే వారికి గట్టిగా సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని మోడీ ఆత్మ నిర్భర్ భారత్ కోసం ఏ విధంగా పని చేయాలనే దానిపై దిశా నిర్దేశం చేసిన విషయాన్ని శ్రీమాధవ్ గుర్తు చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, టెలికాం, రక్షణ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రజలకు అర్ధమయ్యే రీతిలో వివరించాలన్నారు. జీఎస్టీ2.0తో ప్రజలకు జరిగిన లబ్దిని విభాగాల వారీగా వివరించాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై అధికార ప్రతినిధులు అవగతం చేసుకోవాలన్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో జరిగిన నష్టం, ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో ప్రజలకు వచ్చే లాభాలను తగిన వేదికల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు.




వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీసత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ అధికార ప్రతినిధులు అన్ని అంశాలపై విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఇందుకోసం ఆయా అంశాలపై కసరత్తు చేయాలన్నారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ఇవ్వడం పట్ల వైసీపీ చేస్తున్న విమర్శలను బలంగా తిప్పికొట్టాలన్నారు. గత జగన్మోహన రెడ్డి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాన్ని ఏ విధంగా అస్తవ్యస్తం చేసిందనే విషయాలతో పాటు ఇప్పుడు గాడిన పెడుతున్న వైనాన్ని కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులు కీలక భూమిక పోషించాలని సత్యకుమార్ స్పష్టం చేశారు. ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, రాష్ట్ర సంఘటనా మంత్రి శ్రీమధుకర్జీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్, రాష్ట్ర మీడియా ఇన్చార్జి కిలారు దిలీప్, నేషనల్ హబ్ సీఇవో సాయికృష్ణ, రాజకీయ విశ్లేషకులు దుగ్గరాజు శ్రీనివాస్ తదితరులు ఆయా అంశాలపై లోతైన విశ్లేషన, ప్రజలకు వివరించడం వంటి అంశాలపై వివరించారు.



# హైందవ ధర్మ పరిరక్షణలో నాయీ బ్రాహ్మణుల పాత్ర కీలకం



ధన్వంతరి వైద్యాన్ని ముందుకు తీసుకువెళ్తూ సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. నాయీ బ్రాహ్మణులకు నాదస్వరం వాయించడం తో పాటు ధన్వంతరి ఆయుర్వేద విజ్ఞానంలోనూ నైపుణ్యం కలవారని అన్నారు. వారు బలహీను లు కాదని, బలవంతులని ఆయన పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణుల విశిష్ట సేవల గురించి ఆయ న వివరించారు. సమాజంలో నాయీ బ్రాహ్మణు లు ఎదుర్కొంటున్న చిన్నచూపును తొలగించి, వారి గౌరవాన్ని పెంచడం భాజపా లక్ష్యమని ఆయన అన్నారు. నాయీ బ్రాహ్మణుల సంప్రదా య వృత్తి కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతోం దని, తద్వారా ఉపాధిలేక ఇబ్బందులు

## తిరుపతిలో ధన్వంతరి జయంతి ఉత్సవాలు

హైందవ ధర్మాన్ని రక్షించడంలో నాయీ బ్రాహ్మ ణుల పాత్ర కీలకమని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీపీవీఎన్ మాధవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరుపతిలో అక్టోబరు 18న ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. సభకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షు డు రొంగల గోపి శ్రీ నివాస్ అధ్యక్షత వహించా రు. శోభాయాత్ర, సభా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసముద్రం నుంచి ఉ ద్భవించిన ధన్వంతరి ఆయుర్వేదానికి ఆద్యుడని పేర్కొన్నారు. వేల ఏళ్ల తరబడి భారత సమాజం లో ధన్వంతరి వైద్యం వారసత్వం కొనసాగుతూ వస్తోందని నేటికి ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్యంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ సంద ర్భంగా నాయీ బ్రహ్మణులు తమ వృత్తితో పాటు పడుతున్నారని తెలిపారు. వారి వృత్తి కార్పొరేట్ పరం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉంద న్నారు. ఆస్పత్రులు, జైళ్లు, పోలీసు శాఖల్లో నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయాల్లో నాదస్వరం, డోలు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లోకాకళ్యాణా ర్థం సమాజంలోని ప్రతి వర్గం శ్రేయస్సు కోసం







యాగాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం భాజపా ధ్యేయమని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల మేలు కోసం యాగాలు నిర్వహిస్తున్నామని అన్నారు. సర్వధర్మ సమభావం భాజపా మూల సూత్రమని చెప్పారు. భాజపాను ఒక మతానికి అంటగట్టడం సరికాదన్నారు. ప్రతి మతాన్ని గౌరవిస్తూ, భారతీయ సాంప్రదాయ విలువలను కాపాడే దిశగా తాము కృషి చేస్తున్నామని అన్నారు.

ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కంటే ముందే విదేశీ శక్తులు వర్ణ వివక్షతో బీసీ కులాలపై దాడి చేశాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో బీసీ కులాల పాత్ర కీలకమని వివరించారు. బీసీ కులాలను వివక్ష నుంచి విముక్తి చేయడానికి ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణుల హక్కుల పరిరక్షణకు భాజపా కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి, సురేష్ (కర్నాటక), భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ సంఘాల నేతలు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా శోభాయాత్ర

ధన్వంతరి జయంతి ఉత్సవంలో భాగంగా తిరుపతిలో శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. బాలాజీకాలనీ పూలే విగ్రహం నుంచి గాంధీభవన్ వరకు సాగిన ఈ యాత్రలో నాయీ బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు గాంధీభవన్ వేదికగా ధన్వంతరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, దీపప్రజ్వలనతో సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకురాలు, గాయని ఎంఎం శ్రీలేఖ ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.



# ఉగ్రవాదంపై సమిష్టి పోరాటం అవసరం




## భారత్-యూకే బంధం: 'విజన్ 2035' దిశగా నూతన శకం

భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య చారిత్రక సంబంధాలు 21వ శతాబ్దపు సవాళ్లకు, అవకాశాలకు అనుగుణంగా వేగంగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ నూతన శకానికి నాంది పలుకుతూ, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధానమంత్రి శ్రీ కీర్ స్టార్మర్, భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు 2025 అక్టోబర్ 8, 9 తేదీలలో భారతదేశంలో తన తొలి అధికారిక పర్యటనను అత్యంత ఫలవంతంగా ముగించారు. ఇది కేవలం దౌత్యపరమైన పర్యటన మాత్రమే కాదు, ఇరు దేశాల మధ్య నెలకొన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఆచరణాత్మక కార్యాచరణలోకి మార్చే ఒక పటిష్టమైన ముందడుగు.

ఈ పర్యటన యొక్క ప్రాముఖ్యతను ప్రధాని స్టార్మర్ వెంట వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్పష్టం చేస్తోంది. కేవలం రాజకీయ నాయకులే కాకుండా, ఆ దేశ వ్యాపార, వాణిజ్య మంత్రి శ్రీ పీటర్ కైల్, స్కాట్లాండ్ మంత్రి శ్రీ డోగ్లస్ అలెగ్జాండర్, పెట్టుబడుల మంత్రి శ్రీ జేసన్ స్టాక్‌వుడ్‌లతో పాటు, ఏకంగా 125 మంది సీఈవోలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, సాంస్కృతిక నాయకులు ఈ బృందంలో ఉండటం విశేషం. ఇది ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, విద్యా సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్న యూకే ప్రగాఢ ఆకాంక్షకు నిదర్శనం.

ఈ పర్యటనకు కేవలం మూడు నెలల ముందు, 2025 జులైలో, ప్రధానమంత్రి మోడీ యూకేలో పర్యటించారు. ఆ పర్యటనలోనే ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక 'భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదిరింది. దాంతో పాటే, భవిష్యత్ సంబంధాలకు దిక్సూచిగా 'ఇండియా–






యూకే విజన్ 2035' మరియు రక్షణ రంగంలో సహకారానికి పటిష్టమైన పునాది వేస్తూ 'రక్షణ పారిశ్రామిక ప్రణాళిక'లను ఇరు దేశాలు స్వీకరించాయి. ఇప్పుడు, ప్రధాని స్టార్మర్ పర్యటన ఆ ఒప్పందాలను, ప్రణాళికలను కాగితాలకే పరిమితం చేయకుండా, వాస్తవ రూపంలోకి తీసుకు వచ్చే వేగాన్ని పెంచే లక్ష్యంతో సాగింది.

ఆర్థిక బంధం: 'సీఈటీఏ' నుంచి ఆచరణ దిశగా ప్రధాని స్టార్మర్ పర్యటనలో ఆర్థిక, వాణిజ్య అంశాలు ప్రధానాంశంగా నిలిచాయి. ఇరు దేశాల ప్రధానులు అక్టోబర్ 9న ముంబైలో జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్'లో పాల్గొని ప్రసంగించడం, ఈ పర్యటన యొక్క ఆర్థిక ప్రాధాన్యతను చాటిచెబుతోంది. భారతదేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా జరిగిన ఇండియా–యూకే సీఈవో ఫోరం సమావేశం ఈ పర్యటనకు మరో హైలైట్. 125 మంది అగ్రశ్రేణి వ్యాపారవేత్తలతో కూడిన బ్రిటిష్ ప్రతినిధి బృందం, భారతీయ పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమైంది.

'సీఈటీఏ' ఆమోదంపై ఆతృత: ఇరు దేశాల నాయకులు, జులైలో సంతకం చేసిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంను వీలైనంత త్వరగా ఆయా దేశాల పార్లమెంట్లు ఆమోదించాలని గట్టిగా ఆకాంక్షించారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే, వస్తువులు, సేవల వాణిజ్యానికి అడ్డంకులు తొలగి, పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుంది. తద్వారా లభించే అపారమైన ప్రయోజనా లను వీలైనంత త్వరగా అందిపుచ్చుకోవడానికి ఇరువురు నాయకులు ఎదురుచూస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ CETA అమలును పర్యవేక్షించడానికి, వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి 'ఉమ్మడి ఆర్థిక, వాణిజ్య కమిటీని పునర్నిర్మించడాన్ని ఇరు ప్రధానులు స్వాగతించారు.

పెట్టుబడులకు విస్తృత అవకాశాలు: యూకే ప్రధాని వెంట వచ్చిన వ్యాపార ప్రతినిధి బృందం, భారతదేశంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలపై దృష్టి సారించింది. ముఖ్యంగా, నిర్మాణం, మౌలిక వసతులు, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, రక్షణ, విద్య, ఆర్థిక, నైపుణ్య ఆధారిత వ్యాపార సేవల వంటి అనేక రంగాలలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని ఈ బృందం గుర్తించింది. భారతదేశానికి చెందిన నీతి ఆయోగ్, లండన్ నగర కార్పొరేషన్ మధ్య కొనసాగుతున్న 'యూకే ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ బ్రిడ్జి ' కార్యక్రమం, సుస్థిరమైన అభివృద్ధి కోసం ఇరు దేశాలు ఎలా కలిసి పనిచేస్తున్నాయో తెలియజేస్తుంది.
అంతేకాకుండా, ఇరుదేశాల మధ్య రవాణా సదుపాయాలను, ముఖ్యంగా విమానయాన రంగంలో సహకారాన్ని విస్తరించుకోవాలని ప్రధానులు నిర్ణయించారు. ఇందుకోసం భారత్–యూకే విమాన సేవల ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు జరుగుతున్న చర్చలను వారు స్వాగతించారు.

## భవిష్యత్ బంధం: సాంకేతికత, ఆవిష్కరణలే కీలకం

ఈ పర్యటనలో అత్యంత కీలకమైన మరో అంశం టెక్నాలజీ. సమ్మిళిత ఆర్థిక వృద్ధి, జాతీయ భద్రత, అంతర్జాతీయ ఆవిష్కరణల భవిష్యత్తు కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలనే ఉమ్మడి నిబద్ధతను ఇరు ప్రధానులు బలంగా పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న 'విప్లవాత్మక టెక్నాలజీ సెక్యూరిటీ ఇనీషియేటివ్ ఆధారంగా సాధించిన పురోగతిని నాయకులు సమీక్షించారు. ముఖ్యంగా టెలీకమ్యూనికేషన్లు, కీలకమైన ఖనిజాలు, కృత్రిమ మేధ, హెల్త్ టెక్ వంటి రంగాల్లో సహకారం ఊపందుకుంది.

ఈ TSI పరిధిలో, భవిష్యత్తుకు పునాది వేసే పలు నూతన కార్యక్రమాలను ఈ పర్యటనలో ప్రకటించారు:

ఇండియా–యూకే కనెక్టివిటీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్: ఇది 6జీ టెక్నాలజీ, ఉపగ్రహ ఆధారిత నెట్‌వర్క్‌లు, టెలికాం సైబర్ భద్రత కోసం AI–ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేసే సంయుక్త కేంద్రంగా పనిచేస్తుంది. దీని మొదటి దశ కోసం కనీసం 24 మిలియన్ యూరోలతో సంయుక్త నిధిని ఏర్పాటు చేస్తారు.

ఇండియా–యూకే జాయింట్ సెంటర్ ఫర్ ఏఐ: ఆరోగ్యం, వాతావరణ మార్పులు, ఫిన్‌టెక్ వంటి కీలక రంగాల్లో 'బాధ్యతాయుతమైన,

నమ్మకమైన' కృత్రిమ మేధను అభివృద్ధి చేయడానికి ఈ కేంద్రం పనిచేస్తుంది.

యూకే-ఇండియా క్రిటికల్ మినరల్స్ కొలాబరేషన్ గిల్డ్: ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలకు అవసరమైన కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, వైవిధ్యీకరించడం ఈ గిల్డ్ లక్ష్యం.

క్రిటికల్ మినరల్స్ సప్లయి చెయిన్ అబ్జర్వేటరీ (రెండో దశ): ఖనిజాల వెలికితీతను విస్తరించడం, అధునాతన సాంకేతికతలను ఉపయోగించడం, ద్వైపాక్షిక పెట్టుబడులను ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఇందులో భాగంగా ఐఐటీ ధన్‌బాద్‌లో కొత్త శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తారు.

ఇవి మాత్రమే కాకుండా, బయోటెక్నాలజీ రంగంలోనూ ఇరు దేశాలు వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. బయోమాన్యుఫాక్చరింగ్, 3డీ బయో ప్రింటింగ్, జెనోమిక్స్ వంటి భవిష్యత్ సాంకేతికతలలో యూకేకు చెందిన సెంటర్ ఫర్ ప్రాసెస్ ఇన్నోవేషన్, హెన్రీ రాయ్స్ ఇన్స్టిట్యూట్, ఆక్స్‌ఫర్డ్ నానోపోర్ టెక్నాలజీస్ వంటి సంస్థలుబీ భారత్‌కు చెందిన బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, సీడీఎఫ్‌డీ వంటి అగ్రశ్రేణి సంస్థలతో కలిసి పనిచేయనున్నాయి.

## వ్యూహాత్మక భాగస్వామ్యం: రక్షణ, భద్రత, ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

భారత్-యూకే సంబంధాల్లో రక్షణ, భద్రత మూలస్తంభాల్లాంటివి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ సహకారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సంయుక్త సైనిక విన్యాసాలు (ఇటీవలి కొంకణ్ విన్యాసాల వంటివి), శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య నిర్మాణం ద్వారా ఇరు దేశాల రక్షణ బలగాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు నాయకులు అంగీకరించారు. సముద్ర భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, 'ఇండో పసిఫిక్ మహాసముద్రాల కార్యక్రమం పరిధిలో ఒక 'రీజనల్ మ్యారీటైమ్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయడం ద్వారా సముద్ర వాణిజ్య భద్రతా సహకారాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ఉభయపక్షాలు కట్టుబడి ఉన్నాయి.

శిక్షణ రంగంలో ఒక అరుదైన ఒప్పందం రూపుదిద్దుకుంది. భారత వాయుసేనలో అత్యంత నైపుణ్యం కలిగిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, యూకే రాయల్ ఎయిర్ ఫోర్స్ పైలట్లకు శిక్షణ ఇచ్చే ఒప్పందంలో పురోగతి సాధించడాన్ని ఇద్దరు నాయకులు స్వాగతించారు.

ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం: రక్షణ పారిశ్రామిక ప్రణాళికలో భాగంగా, 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి పెద్ద ఊతం ఇస్తూ, భారతీయ నౌకాసేన నౌకల కోసం సముద్ర విద్యుత్ ప్రొపల్షన్ వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి భారత్-యూకే అంతర ప్రభుత్వ ఒప్పందం ఖరారు చేసే దిశగా పురోగతి సాధించడం పట్ల ఇరువురు ప్రధానులు సంతృప్తి వ్యక్తం చేశారు. మరో కీలకమైన ముందడుగుగా, భారత వాయుసేన సామర్థ్యాలను పెంపొందించేందుకు 'లైట్‌వెయిట్ మల్టీరోల్ మిస్సైల్ వ్యవస్థల సరఫరా కోసం రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరినట్లు నాయకులు ప్రకటించారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు: అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని, హింసాత్మక అతివాదాన్ని ప్రధానులిద్దరూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి అందుతున్న ఆర్థిక సహకారాన్ని అడ్డుకోవడం, సరిహద్దుల వద్ద ఉగ్రవాదుల కదలికలను నిలువరించడం, సమాచార మార్పిడి, న్యాయపరమైన సహకారం వంటి అంశాలలో ద్వైపాక్షిక, బహుపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన హేయమైన ఉగ్రదాడిని ఇరువురు నేతలు తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయంగా నిషేధించబడిన ఉగ్రవాదులపై, ఉగ్రవాద సంస్థలపై నిర్ణయాత్మక, సంఘటిత చర్యలు తీసుకోవడానికి సహకారాన్ని పెంపొందించేందుకు అంకితభావంతో ఉన్నట్లు ప్రకటించారు.

హరిత లక్ష్యాలు - జన వారధి: పర్యావరణం, విద్య, ప్రజలు పర్యావరణ మార్పులపై పోరాటంలో, ముఖ్యంగా ఉద్గారాలను శూన్య స్థితికి (నెట్ జీరో) తీసుకురావడంలో సహకారానికి ఇరు దేశాలు అత్యంత ప్రాధాన్యతనిచ్చాయి. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన నిధులను (గ్రీన్ ఫైనాన్స్) పెంచడానికి, ఇరు దేశాల్లోనూ పర్యావరణ హిత వృద్ధిని (గ్రీన్ గ్రోత్) ప్రోత్సహించడానికి ఉద్దేశించిన 'ఇండియా-యూకే పర్యావరణ ఆర్థిక కార్యక్రమాన్ని' ప్రధానులు స్వాగతించారు. దీనిలో భాగంగా, పర్యావరణ సాంకేతిక అంకుర సంస్థలకు (గ్రీన్ టెక్ స్టార్టప్స్) నిధులు అందించేందుకు యూకే ప్రభుత్వం, భారతీయ స్టేట్ బ్యాంక్ మధ్య ఒక ఉమ్మడి పెట్టుబడి నిధిని ప్రకటించారు. అలాగే, తీరప్రాంత పవన విద్యుత్ రంగంలో సహకారానికి ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు.

విద్యా రంగంలో విప్లవాత్మక అడుగులు: ఇరు దేశాల సంబంధాల భవిష్యత్తును యువత, విద్య, సాంస్కృతిక బంధాలే నిర్దేశిస్తాయని నాయకులు బలంగా విశ్వసించారు. ద్వైపాక్షిక సహకారంలో విద్యను అత్యంత కీలకమైన అంశంగా గుర్తించారు. ఈ పర్యటనలో విద్యా రంగంలో అపూర్వమైన పురోగతి కనిపించింది. యూకేకు చెందిన తొమ్మిది (9) అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను భారతదేశంలో ఏర్పాటు చేయడంలో గణనీయమైన పురోగతి సాధించడం పట్ల ఉభయపక్షాలు సంతోషం వ్యక్తం చేశాయి.

గురుగ్రామ్‌లో ప్రారంభమైన సౌతాంప్టన్ విశ్వవి

ద్యాలయం క్యాంపస్‌లో మొదటి బ్యాచ్ విద్యార్థులు చదువుకోవడం ప్రారంభించారు.

లివర్‌పూల్, యోర్క్, అబెర్డీన్, బ్రిస్టల్ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలను ఏర్పాటు చేయడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది.

గుజరాత్ గిఫ్ట్‌సిటీలో క్వీన్స్ బెల్‌ఫాస్ట్, కోవెంట్రీ విశ్వవిద్యాలయాలు క్యాంపస్‌లు ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందాయి.

బెంగళూరులో లాంకాస్టర్ విశ్వవిద్యాలయ ప్రాంగణం, గిఫ్ట్ సిటీలో సర్రే విశ్వవిద్యాలయ క్యాంపస్ ఏర్పాటుకు కూడా భారత అధికారులు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఇది భారతీయ ఉన్నత విద్యా రంగంలో ఒక విప్లవాత్మక మార్పుకు నాంది పలుకుతుంది.

ప్రజల మధ్య బంధం: ఇరు దేశాల మధ్య ప్రజల రాకపోకలను సులభతరం చేసే 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్‌షిప్ అమలును సమర్థవంతంగా కొనసాగించాలని ప్రధానులు నిశ్చయించారు. అదే సమయంలో, అక్రమ వలసలను అరికట్టే సహకారంలో సాధించిన పురోగతిని గుర్తిస్తూ, ఈ అంశంలో కలిసి పనిచేయాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్న భారీ సంఖ్యలోని ప్రవాస భారతీయులను ఇరు దేశాల మధ్య 'జీవ వారధి 'గా నాయకులిద్దరూ అభివర్ణించారు.

## ప్రపంచ వేదికపై ఉమ్మడి స్వరం

ప్రపంచ శాంతి, సుస్థిరత, నియమ ఆధారిత ప్రపంచ విధానం పట్ల తమ ఉమ్మడి నిబద్ధతను ఇరు ప్రధానులు పునరుద్ఘాటించారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బహుపాక్షిక వ్యవస్థల్లో సంస్కరణలు తీసుకురావడానికి కలిసి పనిచేయాలని అంగీకరించారు. ఇందులో భాగంగా, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి లో సంస్కరణల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. యూఎన్ ఎస్‌సీలో శాశ్వత సభ్యత్వం పొందాలన్న భారతదేశ న్యాయబద్ధమైన ఆకాంక్షలకు యునైటెడ్ కింగ్‌డమ్ తన దీర్ఘకాలిక




మద్దతును మరోసారి బలంగా తెలియజేసింది. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా నేతలు చర్చించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు అనుగుణంగా ఉక్రెయిన్‌లో న్యాయమైన, శాశ్వత శాంతి స్థాపనకు ఇరువురు ప్రధానులు మద్దతు తెలిపారు. మధ్యప్రాచ్యంలో శాంతి, స్థిరత్వం పట్ల తమ నిబద్ధతను తెలియజేస్తూ, అన్ని పక్షాలు సంయమనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా, గాజా కోసం యూఎస్ శాంతి ప్రణాళికకు మద్దతు తెలియజేస్తూ.. తక్షణ, శాశ్వత కాల్పుల విరమణ, బందీల విడుదల, మానవతా సాయం కోసం ప్రాంతీయ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి అంగీకరించారు. సురక్షితమైన ఇజ్రాయెల్‌తో పాటు, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు ద్వారానే శాశ్వత శాంతి సాధ్యమనే ఉమ్మడి అంకితభావాన్ని తెలియజేశారు.



# సంప్రదాయానికి నవీన ఆవిష్కరణలు తోడైతే అద్భుత ఫలితాలు



**సెప్టెంబర్ 28న ప్రసారమైన 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు**

నవరాత్రి సమయంలో మనం శక్తి ఉపాసన చేస్తాం. మహిళా శక్తిని ఉత్సవంగా జరుపుకొంటాం. వ్యాపారం నుండి క్రీడల వరకు, విద్య నుండి సైన్స్ వరకు ఏ రంగాన్ని తీసుకున్నా మన దేశ అమ్మాయిలు ప్రతిచోటా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. ఊహించడానికి కూడా కష్టమైన సవాళ్లను వారు అధిగమిస్తున్నారు. మీరు 8 నెలల పాటు నిరంతరాయంగా సముద్రంలో ఉండగలరా? చుక్కాని ఉన్న పడవలో– అంటే గాలి వేగంతో కదిలే పడవలో– 50 వేల కిలోమీటర్లు ప్రయాణించగలరా? అది కూడా సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు? మీరు దీన్ని చేసే ముందు వెయ్యి సార్లు ఆలోచిస్తారు. కానీ నావికా సాగర్ పరిక్రమ సమయంలో ఇద్దరు ధైర్యవంతులైన నౌకాదళ మహిళా అధికారులు దీన్ని సాధించారు. ధైర్యం, దృఢ సంకల్పం అంటే ఏమిటో వారు నిరూపించారు. ఆ ఇద్దరు.. ఒకరు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, మరొకరు లెఫ్టినెంట్ కమాండర్ రూప.

మన పండుగలు భారతదేశ సంస్కృతిని సజీవంగా ఉంచుతాయి. ఛత్ పూజ దీపావళి తర్వాత వచ్చే పవిత్ర పండుగ. సూర్య భగవానుడిని ఆరాధించే ఈగొప్ప పండుగ సందర్భంగా అస్తమించే సూర్యుడికి కూడా నీటిని అర్పించి పూజిస్తాం. ఛత్ పండుగ ప్రపంచవ్యాప్త పండుగగా మారుతోంది. ఛత్ పూజను యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఛత్ పూజ ఉత్సవాన్ని యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చినప్పుడు ప్రపంచంలోని ప్రతి మూలలోని ప్రజలు దాని గొప్పతనాన్ని, దివ్యత్వాన్ని అనుభవించగలుగుతారు. కొంతకాలం కిందట భారత ప్రభుత్వం చేసిన ఇలాంటి ప్రయత్నాల కారణంగా కోల్‌కతాలోని దుర్గా పూజ కూడా ఈ యునెస్కో జాబితాలో భాగమైంది. మనం మన సాంస్కృతిక కార్యక్రమాలకు అటువంటి ప్రపంచ గుర్తింపు ఇస్తే ప్రపంచం వాటి గురించి నేర్చుకుంటుంది, వాటిని అర్థం చేసుకుంటుంది, వాటిలో పాల్గొనడానికి ముందుకు వస్తుంది.

గాంధీజీ ఎల్లప్పుడూ స్వదేశీని స్వీకరించడాన్ని నొక్కిచెప్పారు. వాటిలో ఖాదీ ప్రధానమైనది. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యం తర్వాత ఖాదీ ఆకర్షణ తగ్గుతూ వచ్చింది. కానీ గత 11 సంవత్సరాలలో దేశ ప్రజలలో ఖాదీ పట్ల ఆకర్షణ గణనీయంగా పెరిగింది. గత కొన్ని సంవత్సరాలలో ఖాదీ అమ్మకాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగాయి. ఖాదీ లాగే మన చేనేత, హస్తకళారంగం కూడా గణనీయమైన మార్పులను చూస్తోంది. సంప్రదాయం, నవీన ఆవిష్కరణలు కలిపితే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని ఇవి నిరూపిస్తున్నాయి. తమిళనాడుకు చెందిన యాళ్ నేచురల్స్ దీనికి ఒక ఉదాహరణ. ఇక్కడ అశోక్ జగదీశన్, ప్రేమ్ సెల్వరాజ్ కొత్త చొరవ తీసుకోవడానికి తమ కార్పొరేట్ ఉద్యోగాలను విడిచిపెట్టారు. వారు గడ్డి, అరటి ఫైబర్‌తో యోగా మ్యాట్లను తయారు చేశారు. మూలికా రంగులతో దుస్తులకు రంగులు వేశారు. 200 కుటుంబాలకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించారు. జార?ండ్‌కు చెందిన ఆశిష్ సత్యవ్రత్ సాహు జోహార్ గ్రామ్ బ్రాండ్ ద్వారా గిరిజన నేత వస్త్రాలను ప్రపంచ వేదికకు తీసుకువచ్చారు. ఆయన కృషి ఫలితంగా ఇతర దేశాల ప్రజలు కూడా జార?ండ్ సాంస్కృతిక వారసత్వం గురించి తెలుసుకుంటున్నారు. బీహార్‌లోని మధుబని జిల్లాకు చెందిన స్వీటీ కుమారి సంకల్ప్ క్రియేషన్స్‌ను ప్రారంభించారు. ఆమె మిథిలా పెయింటింగ్‌ను మహిళలకు జీవనోపాధి మార్గంగా మార్చారు. నేడు 500 మందికి పైగా గ్రామీణ మహిళలు ఆమెతో స్వావలంబన మార్గంలో ఉన్నారు. ఈ విజయగాథలన్నీ మన సంప్రదాయాలు అనేక ఆదాయ వనరులను కలిగి ఉన్నాయని మనకు బోధిస్తాయి. లక్ష్యం బలంగా ఉంటే విజయం మన నుండి తప్పించుకోలేదు.

ఈ విజయదశమి రోజు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు అవుతోంది. 100 సంవత్సరాల క్రితం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపితమైనప్పుడు దేశం శతాబ్దాలుగా బానిసత్వ సంకెళ్లతో ఉంది. ఈ శతాబ్దాల బానిసత్వం మన ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ప్రపంచంలోని పురాతన నాగరికత గుర్తింపు సంక్షోభాన్ని ఎదుర్కొంది. దేశ ప్రజలు న్యూనతా భావానికి గురయ్యారు. అందువల్ల దేశ స్వాతంత్ర్యంతో పాటు దేశం సైద్ధాంతిక బానిసత్వం నుండి



విముక్తి పొందడం కూడా చాలా ముఖ్యం. ఈ సందర్భంలో డాక్టర్ హెడ్గేవార్ ఈ అంశాన్ని ఆలోచించడం ప్రారంభించారు. ఈ కష్ట తరమైన పని కోసం ఆయన 1925లో విజయదశమి శుభ సంద ర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని స్థాపించారు. డాక్టర్ సాహెబ్ మరణానంతరం గురూజీ ఈ గొప్ప జాతీయ సేవ యాగా న్ని ముందుకు తీసుకెళ్లారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలుగా అవిశ్రాంతంగా, నిరంతరాయంగా దేశానికి సేవ చేసే పనిలో నిమ గ్నమై ఉంది. అందుకే దేశంలో ఎక్కడైనా ప్రకృతి వైపరీత్యం సంభ వించినప్పుడు ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు ముందుగా అక్కడికి చేరుకోవడం మనం చూస్తున్నాం. లక్షలాది స్వచ్ఛంద సేవకుల జీవి తాల్లోని ప్రతి చర్యలోనూ, ప్రతి ప్రయత్నంలోనూ ఈ నేషన్ ఫస్ట్ అనే జాతి స్ఫూర్తి ఎల్లప్పుడూ ప్రధానమైనది. జాతీయ సేవ అనే గొప్ప యజ్ఞానికి తనను తాను అంకితం చేసుకుంటున్న ప్రతి స్వచ్ఛంద సేవ కుడికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

భారతీయ సంస్కృతికి మహర్షి వాల్మీకి ఎంత ముఖ్యమైన పునాది వేశారో మనందరికీ తెలుసు. శ్రీరాముని అవతార కథలను మనకు అంత వివరం గా పరిచయం చేసినది మహర్షి వాల్మీకి. ఆయన మానవాళికి అద్భుతమైన రామాయణ గ్రంథాన్ని ఇచ్చారు. రామాయణం ప్రభావం దానిలో పొందు పరిచిన శ్రీరాముని ఆదర్శాలు, విలువల వల్ల వచ్చింది. భగవాన్ శ్రీరాము డు సేవ, సామరస్యం, కరుణతో అందరినీ ఆలింగనం చేసుకున్నాడు. అందుకే శబరి మాత, నిషాదరాజులతో మాత్రమే మహర్షి వాల్మీకి రామా యణంలోని రాముడు పరిపూర్ణం అయ్యాడని మనం చూస్తాం. అయోధ్యలో రామాలయం నిర్మితమైనప్పుడు నిషాదరాజు, మహర్షి వాల్మీకి ఆలయాలు కూడా దాని పక్కనే నిర్మితమయ్యాయి. రామ్ లల్లాను చూడటానికి అయో ధ్యకు వెళ్ళినప్పుడు మహర్షి వాల్మీకి, నిషాదరాజు ఆలయాలను సందర్శిం చాలని కోరుతున్నాను.

భూపేన్ హజారికా జీ జన్మ శతాబ్ది ఉత్సవాలను అస్సాం జరుపుకుంటుండ గా, జుబీన్ గర్గ్ జీ అకాల మరణంతో ప్రజలు శోకతప్తులయ్యారు. జుబీన్ గర్గ్ దేశవ్యాప్తంగా తనదైన ముద్ర వేసిన ప్రఖ్యాత గాయకుడు. ఆయనకు అస్సామీ సంస్కృతితో గాఢమైన సంబంధం ఉంది. జుబీన్ గర్గ్ ఎల్లప్పుడూ మన జ్ఞాపకాలలో నిలిచి ఉంటారు. ఆయన సంగీతం భవిష్యత్ తరాలను మంత్ర ముగ్ధులను చేస్తూనే ఉంటుంది.

ఒక గొప్ప ఆలోచనాపరుడు, తత్వవేత్త ఎస్. ఎల్. భైరప్పను కొన్ని రోజుల క్రితం దేశం కోల్పోయింది. భైరప్పతో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. మేం వివిధ అంశాలపై చాలా లోతైన చర్చలు చేశాం. ఆయన రచనలు యువత ఆలోచనలకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయి. ఆయన కన్నడలో చేసిన అనేక రచనల అనువాదాలు కూడా అందుబాటులో ఉన్నాయి. మన మూలాలు, సంస్కృతి గురించి గర్వపడటం ఎంత ముఖ్యమో ఆయన నేర్పించారు. ఎస్.ఎల్. భైరప్పకు నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా ను. ఆయన రచనలను చదవాల్సిందిగా యువతను కోరుతున్నాను.

పండుగలు ఆనందాలను తీసుకువస్తున్నాయి. ఈసారి 'జీఎస్టీ పొదుపు పండుగ' కూడా జరుగుతోంది. ప్రతిజ్ఞ చేయడం ద్వారా మీరు మీ పండుగ లను మరింత ప్రత్యేకంగా చేసుకోవచ్చు. ఈసారి మనం స్వదేశీ ఉత్పత్తుల తో మాత్రమే పండుగలు జరుపుకోవాలని నిశ్చయించుకుంటే మన వేడుకల ఆనందం అనేకరెట్లు పెరుగుతుందని మీరు చూస్తారు. 'వోకల్ ఫర్ లోకల్' ను మీ షాపింగ్ మంత్రంగా చేసుకోండి. దేశంలో తయారు చేసిన వాటిని మాత్రమే మీరు కొనుగోలు చేయాలని ఎప్పటికీ నిర్ణయించుకోండి. దేశ ప్రజలు తయారు చేసిన వాటిని మాత్రమే మీరు ఇంటికి తీసుకెళ్తారు. దేశ పౌరుడు కష్టపడి పనిచేసిన వస్తువులను మాత్రమే మీరు ఉపయోగిస్తారు. మనం ఇలా చేసినప్పుడు మనం కేవలం వస్తువులను కొనడం మాత్రమే కాదు, ఒక కుటుంబానికి ఆశను తీసుకువస్తాం. చేతివృత్తులవారి కష్టాన్ని గౌరవిస్తాం. ఒక యువ వ్యవస్థాపకుడి కలలకు రెక్కలు ఇస్తాం.

పండుగల సమయంలో మనమందరం మన ఇళ్లను శుభ్రం చేసుకోవడం లో తీరిక లేకుండా ఉంటాం. కానీ పరిశుభ్రత ఇంటి నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వీధి, ప్రాంతం, మార్కెట్, గ్రామం – ప్రతిచోటా పరిశుభ్రత మన బాధ్యతగా మారాలి. మనం స్వావలంబన చెందాలి. దేశం స్వావలంబన చెందేలా చూడాలి. దానికి మార్గం స్వదేశీ ద్వారా మాత్రమే ఉందని మరోసారి చెప్పాలనుకుంటున్నాను.

# వికసిత్ భారత్‌కు బాటలు వేస్తున్న స్వావలంబన



ఒకప్పుడు అంతర్జాతీయ వేదికపై పరిమిత పాత్ర పోషించిన భారత్ ఇప్పుడు తన స్వాభావిక సంపదలు, భారీ పరిశ్రమలను ఉపయోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 18 అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో పోటీ పడుతోంది. వేగంగా పెరుగుతున్న కీలక రంగాలు, అలాగే దేశ సహజ సంపద, సామర్థ్యాలు, వ్యూహాత్మక ప్రాధాన్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 2023లో 690 బిలియన్ (బిలియన్-వంద కోట్లు) డాలర్లుగా ఉన్న ఆదాయాన్ని 2030 నాటికి 2 ట్రిలియన్లకు (ట్రిలియన్-లక్ష కోట్లు) పెంచగల 18 కీలక రంగాలను గుర్తించారు. ఈ రంగాలు 2040 నాటికి అదనపు స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉండగలవని అంచనా. ఎలక్ట్రానిక్స్ నుంచి స్వచ్ఛ ఇంధనం (గ్రీన్ ఎనర్జీ), రక్షణ రంగం వరకు భారతీయ పరిశ్రమలు కేవలం దేశాభివృద్ధికి మాత్రమే కాకుండా GDP 30 ట్రిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేసిన 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) అనే శతాబ్దాల నాటి స్వదేశీ ఆదర్శాన్ని కూడా ముందుకు తీసుకువెళుతున్నాయి. ఈ వ్యూహంలో భారతదేశ జనాభా అత్యంత ముఖ్యమైన సానుకూల అంశం. దేశ జనాభాలో సగానికి పైగా 30 ఏళ్లలోపు వారు ఉండడం, అలాగే 2025 ఆర్థిక సంవత్సరంలో GDPలో ప్రైవేట్ వ్యయం 61.4 శాతం కంటే ఎక్కువ ఉండటం వల్ల దేశీయ మార్కెట్ పరిమాణం వృద్ధిని ప్రోత్సహించి, ప్రపంచస్థాయిలో పోటీపడే శక్తిని పెంచుతుంది. 2030 నాటికి 7.5 కోట్ల మధ్యతరగతి, 2.5 కోట్ల ధనవంతుల కుటుంబాలు ఉంటాయని, ఇది జనాభాలో 56 శాతంగా ఉంటుందని అంచనా. ఇది వినియోగదారుల స్థాయిలో మునుపెన్నడూ లేని అధునాతనకు దారితీస్తుంది.

## సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ

ప్రపంచ చిప్ డిజైనర్లలో 20 శాతానికిపైగా భారత్‌లోనే ఉన్నారు. అయినప్పటికీ, దేశం సెమీకండక్టర్ అవసరాలకు దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం 'భారత్ సెమీకండక్టర్ మిషన్' కింద ఐదు సెమీకండక్టర్ తయారీ యూనిట్లకు ఆమోదం తెలిపింది. వీటిలో మొత్తం పెట్టుబడి 18.15 బిలియన్ డాలర్లు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల కోసం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని విస్తరించడం, 5జి, ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), విద్యుత్ వాహనాల వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు కీలక భాగాలను ఉత్పత్తి చేయడం లక్ష్యం. 2030 నాటికి సెమీకండక్టర్ రంగాన్ని 150 బిలియన్ డాలర్లకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## వ్యవసాయం

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయరంగంలో ఉత్పాదకతను పెంచడానికి, పంట కోత అనంతర నష్టాలను తగ్గించడానికి డిజిటల్ పరివర్తన ద్వారా ప్రయోజనం పొందవచ్చు. సేంద్రియ వ్యవసాయం, నిర్దిష్ట సాగు, స్మార్ట్ (పొదుపైన పద్ధతుల్లో) నీటిపారుదల వంటి డిజిటల్ సాంకేతికతలు రైతులకు సమాచార ఆధారిత అవగాహనలను కల్పిస్తాయి. తయారీ, వ్యవసాయ రంగాలలో డిజిటల్ టెక్నాలజీల వినియోగం స్వయంసమృద్ధిని పెంచుతుంది.

## ప్రధాన తయారీ పరిశ్రమలు

ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారతదేశ రక్షణ రంగం వేగంగా స్వావలంబన సాధిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ రక్షణ ఉత్పత్తి రూ.1.27 లక్షల కోట్లకు చేరి, 2014-15తో పోలిస్తే దాదాపు 174 శాతం పెరిగింది. 2029 నాటికి రక్షణ ఉత్పత్తిని రూ.3 లక్షల కోట్లకు, ఎగుమతులను రూ.50,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఎలక్ట్రానిక్స్ కీలక పరిశ్రమగా ఉద్భవించింది. నేడు భారత్‌లో విక్రయించే మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశంలోనే తయారవుతున్నాయి. మనం ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ తయారీదారుగా నిలిచాం. పునరుత్పాదక ఇంధన రంగం కూడా ప్రధాన వ్యాపారంగా మారింది. 100 గిగావాట్ల సౌర పీవీ మాడ్యూల్ తయారీ సామర్థ్యం సాధించడం భారత్ ఆత్మనిర్భర్ లక్ష్యానికి అనుగుణంగా బలమైన, స్వయంసమృద్ధి గల సౌర తయారీ వ్యవస్థ అభివృద్ధిలో దేశం సాధించిన వేగవంతమైన పురోగతికి నిదర్శనం. ఈ ప్రోత్సాహం కారణంగా జూన్ 2025లో భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) సంవత్సరానికి 1.5 శాతం పెరిగింది. తయారీ రంగం 3.9 శాతం వృద్ధి చెందడం దీనికి ప్రధాన కారణం.



## పెరుగుతున్న మధ్యతరగతి

భారతదేశ మధ్యతరగతి జనాభా 2040 నాటికి 59.7 కోట్లకు పైగా పెరుగుతుందని అంచనా. ఈ పెరుగుదల వ్యయ వృద్ధిలో 75 శాతం కంటే ఎక్కువ వాటా కలిగి ఉంటుందని, కొత్త మార్కెట్ అవకాశాలను సృష్టిస్తుందని అంచనా.

## స్థూల ఆర్థిక సూచిక పటిష్టం

అంతర్జాతీయ సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకంగా (పరిస్థితులకు స్పందించే గుణం) ఉంది. 2047 నాటికి స్థూలంగా మన ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, సగటు వార్షిక వృద్ధి రేటు 9-10 శాతం ఉంటుందని అంచనా.



## పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి

పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి 2035 నాటికి మార్కెట్లను పెంచుతుందని, ఉత్పాదకతను పెంచుతుందని, కోట్ల సంఖ్యలో ఉద్యోగాల ను సృష్టిస్తుందని అంచనా. పట్టణ ప్రాంతాలు 2036 నాటికి భారతదేశ GDPలో 70 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంటాయని భావిస్తు న్నారు. ఈ మార్పునకు మద్దతుగా 2030 వరకు మౌలిక సదుపాయాలపై ఏటా 290 బిలియన్ డాలర్లకు పైగా మనదేశం పెట్టుబడి పెట్టనుంది.

## తయారీ, వాణిజ్య వైవిధ్యం:

'భారత్‌లో తయారీ', 'ఉత్పత్తి-అనుబంధ ప్రోత్సాహకం' వంటి కార్యక్రమాలు తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ఆసియాతో సహా కొత్త దేశాలతో భారత దేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా 2030 నాటికి ఎగువ-ుతులను 2 ట్రిలియన్ డాలర్లను (రెండు లక్షల కోట్ల డాలర్లు) దాటాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఆటోమోటివ్ పరిశ్రమ:

భారత్ ఆటోమొబైల్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా మారుతోంది. 2030 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 33 లక్షల వాహనాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## అంతరిక్ష పరిశ్రమ:

భారతదేశ అంతరిక్ష పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2030 నాటికి ప్రపంచ మార్కెట్‌లో 8-10 శాతం వాటాను లక్ష్యంగా పెట్టుకుంది, 2047 నాటికి 15 శాతం మార్కెట్ వాటా సాధించాలని ఆశిస్తోంది.

## సవాళ్లు, భవిష్యత్తు

ప్రపంచ ఎగుమతుల్లో పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ఆటోమొబైల్స్, ప్లాస్టిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ప్రధాన స్థానం ఆక్రమిస్తున్నాయి. అయినప్పటికీ మన ఎగుమతుల్లో వీటి వాటా తక్కువగా ఉంది. అధిక సాంకేతికత ఎగుమతుల్లో భారతదేశం వాటా మొత్తం ఎగుమతుల్లో కేవలం 6.3 శాతం మాత్రమే. చైనా (29 శాతం), దక్షిణ కొరియా (32 శాతం), వియత్నాం (34 శాతం) కంటే మనం చాలా వెనుకబడి ఉన్నాం. అయితే ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ఇటీవలి చర్యలు ఈ పరిస్థితిని సరిదిద్దే అవకాశం ఉంది.

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే, పట్టణాలకే పరిమితమైన ఉన్నత విద్యా వ్యవస్థను వికేంద్రీకరించాలి. ప్రాంతీయ, స్థానిక స్థాయిలో సంస్థాగత సామర్థ్యాల బలమైన నెట్‌వర్క్‌ను స్థాపించడానికి నిధులు అవసరం. నైపుణ్యాల పెంపు అవకాశాలను అందించడం ద్వారా ప్రతి పౌరుడిని స్వయంసమృద్ధి గల వ్యక్తిగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తోంది. స్వయంసమృద్ధ భారత్ మరింత శక్తిమంతమైన, ఆరోగ్యకరమైన, సంపన్నమైన భారత్‌కు మార్గాన్ని నిర్దేశిస్తుంది. ఇది ప్రపంచ శాంతి, అభివృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.

# రైతుల నైపుణ్యాలకు పదును



రైతుల సాధికారత దేశ వ్యవసాయ వ్యూహంలో ప్రధానాంశంగా మారింది. మన జనాభాలో దాదాపు మూడింట రెండు వంతుల మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో సగం మంది జీవనోపాధికి వ్యవసాయంపైనే ఆధారపడటం వల్ల రైతుల నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించడం సమ్మిళిత, సుస్థిర వృద్ధికి చాలా అవసరం. నేటి రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు కేవలం రుణాలు లేదా పెట్టుబడులకు మాత్రమే పరిమితం కాలేదు. వాతావరణ మార్పులకు అనుగుణంగా మారడం, నేల ఆరోగ్యాన్ని కాపాడటం, యాంత్రీకరణను స్వీకరించడం, మెరుగైన మార్కెట్ అవకాశాలను పొందడం వంటివి కూడా వారు ఎదుర్కొంటున్న సవాళ్లలో ఉన్నాయి. దీనిని గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి ఎజెండాలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణకు ప్రాధాన్యమిచ్చింది. గత దశాబ్దంలో రైతులకు ఆచరణాత్మక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమాలతో రైతులు కేవలం సాగుదారులుగానే కాకుండా, ఆవిష్కర్తలు, నిర్ణేతలు, వ్యవసాయ - విలువ గొలుసులో చురుకైన భాగస్వాములుగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవికే), వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఏటిఎంఏ), గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ (ఎస్టిఆర్‌వై), వ్యవసాయ యాంత్రీకరణ ఉప-మిషన్ (ఎస్ఎంఏఎం), ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై), వంటి సంస్థలు, పథకాలు బలమైన శిక్షణా వేదికలను అందిస్తున్నాయి. వీటితో పాటు హార్టికల్చర్ (ఉద్యాన పంటలు), పశుపోషణ, భూసార పరిరక్షణ, ఆహార శుద్ధి వంటి రంగాలకు సంబంధించిన కార్యక్రమాలలోనూ నైపుణ్యాన్ని అందిస్తున్నారు. ఈ సమష్టి ప్రయత్నాలన్నీ ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నొక్కి చెబుతున్నాయి. అది ఉత్పాదకతను, ఆదాయాలను పెంచడానికి, పటిష్టమైన వ్యవసాయ రంగాన్ని నిర్మించడానికి నైపుణ్యాల పెంపు ద్వారా రైతులకు సాధికారత కల్పించడం చాలా కీలకం అని.

## రైతుల శిక్షణకు సంస్థాగత వేదికలు

రైతులకు నేరుగా నైపుణ్యాన్ని అందించడానికి బలమైన సంస్థాగత వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది. ఇందులో కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవికే), పధాన పాత్ర పోషిస్తున్నాయి. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఏఆర్), ద్వారా స్థాపించిన కేవికేలు, జిల్లాలవారీగా ప్రధాన వ్యవసాయ విస్తరణ కేంద్రాలుగా పనిచేస్తాయి. ఇవి స్థానిక వ్యవసాయ-వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆచరణాత్మక శిక్షణ, ప్రదర్శనలు, వృత్తి కోర్సుల ద్వారా పరిశోధన, ఆచరణ మధ్య అంతరాన్ని పూరిస్తున్నాయి. 2021-2024 మధ్య కేవికేలు 58.02 లక్షల మంది రైతులకు శిక్షణ ఇచ్చాయి. ప్రతి సంవత్సరం ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2021-22లో 16.91 లక్షలు, 2022-23లో 19.53 లక్షలు, 2023-24లో 21.56 లక్షల మంది రైతులు శిక్షణ పొందారు. 2024-25లో ఫిబ్రవరి 2025 వరకు 18.56 లక్షల మంది రైతులు శిక్షణ పొందారు. ఈ గణాంకాలు పంట నిర్వహణ, భూసారం, పశుపోషణ, అనుబంధ కార్యకలాపాలలో రైతులకు ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడంలో కేవికే వ్యవస్థ స్థిరత్వం, స్థాయిలను ప్రతిబింబిస్తున్నాయి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షణను అందిస్తూ, శాస్త్రీయ పద్ధతులను పరిచయం చేయడం ద్వారా కేవికేలు రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడంలో అత్యంత ప్రభావవంతమైన వేదికల్లో ఒకటిగా మారాయి. దీనికి తోడు, వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఏటిఎంఏ) రాష్ట్రాలు తమ విస్తరణ వ్యవస్థలను పునరుద్ధరించడంలో వాటికి మద్దతు ఇచ్చింది. 'విస్తరణ సంస్కరణల కోసం రాష్ట్ర విస్తరణ కార్యక్రమాలకు మద్దతు'కు ఉద్దేశించిన కేంద్ర ప్రాయోజిత పథకమైన 'ఆత్మ'ను దేశవ్యాప్తంగా కేంద్ర వ్యవసాయశాఖ అమలు చేస్తోంది. ఈ పథకం రైతులకు శిక్షణ, ప్రదర్శనలు, క్షేత్ర సందర్శనలు, కిసాన్ మేళాలు వంటి వాటి ద్వారా తాజా వ్యవసాయ సాంకేతికతలు, మెరుగైన వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'ఆత్మ' (ఏటిఎంఏ) కింద 2021-22లో సుమారు 32.38 లక్షల మంది రైతులకు శిక్షణ ఇవ్వగా ఇది 2022-23లో 40.11 లక్షలకు పెరిగింది. 2023-24లో 36.6 లక్షల మందికి శిక్షణ ఇచ్చారు. 2024-25 సంవత్సరం గణాంకాలు ఇంకా పూర్తికాలేదు. అయితే జనవరి 30, 2025 నాటికి సుమారు 18.3 లక్షల మంది

రైతులకు శిక్షణ ఇచ్చారు. మొత్తంగా 2021 నుండి 2025 వరకు ఈ పథకం దాదాపు 1.27 కోట్ల మంది రైతులను చేరుకుంది.

## గ్రామీణ యువతకు నైపుణ్యం

వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త అవకాశాల కోసం యువతరాన్ని సిద్ధం చేయడానికి కేంద్రం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ (ఎస్‌టిఆర్‌వై) కార్యక్రమాన్ని గ్రామీణ యువతకు, రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాలలో ఏడు రోజుల స్వల్పకాలిక నైపుణ్యం ఆధారిత శిక్షణను అందించడానికి రూపొందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయగలిగే నైపుణ్యం గల మానవ వనరులని సృష్టించడం దీని లక్ష్యం. ఎస్‌టిఆర్‌వై , హార్టికల్చర్, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, పశుపోషణ వంటి రంగాలలో ఆచరణాత్మక వృత్తి శిక్షణను అందిస్తుంది. గత నాలుగు సంవత్సరాలలో ఈ పథకం పరిధి స్థిరంగా పెరుగుతూ వస్తోంది. 2021-22లో 10,456 మంది గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వగా, 2022-23లో 11,634 మందికి, 2023-24లో 20,940 మందికి ఇచ్చారు. 2021-2024 మధ్య మొత్తం 43,000 మందికి పైగా యువతకు శిక్షణ లభించింది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా డిసెంబర్ 31, 2024 వరకు 8,761 మంది యువతకు శిక్షణ ఇచ్చారు.

## వ్యవసాయ యాంత్రీకరణ ఉప-మిషన్

వ్యవసాయ యాంత్రీకరణ ఉప-మిషన్ (ఎస్‌ఎంఏఎం) చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ విద్యుత్ లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో యాంత్రీకరణను విస్తరించాలని చూస్తోంది. చిన్న కమతాల సవాళ్లు, అధిక నిర్వహణ ఖర్చుల సమస్యను పరిష్కరించడానికి కస్టమ్ హైరింగ్ సేవలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. అధికారిక సమాచారం ప్రకారం 2021 నుంచి 2025 వరకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎస్‌ఎంఏఎం మొత్తం 57,139 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది.





## నేల, వనరులపై అవగాహన పెంపు

పంట ప్రణాళిక, ఎరువుల వినియోగంపై రైతులు అన్ని విషయాలు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవడంలో భూసార ఆరోగ్య కార్డు పథకం కీలక పాత్ర పోషించింది. జూలై 24, 2025 నాటికి దేశవ్యాప్తంగా 25.17 కోట్లకు పైగా భూసార ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. దాంతో పాటు 93,000కి పైగా రైతు శిక్షణా కార్యక్రమాలు, 6.8 లక్షల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు భూమిలో సమతుల్య పోషక నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించాయి. ఇక సమష్టి కార్యాచరణ స్థాయిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓ) ఏర్పాటు రైతు సామర్థ్యాన్ని పెంపొందించడానికి కొత్త వేదికలను సృష్టించింది. 10,000 ఎఫ్‌పిఓలు నమోదు కాగా, రైతులకు వ్యవసాయ-వ్యాపార నిర్వహణ, మార్కెట్ అనుసంధానం, ఈ-నామ్ వంటి డిజిటల్ వేదికల వినియోగంపై డిజిటల్ మాడ్యూల్స్, వెబినార్ల ద్వారా క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నారు.

ప్రభుత్వం తమ ప్రధాన జాతీయ పథకాలలోనూ నైపుణ్యాభివృద్ధిని భాగంగా చేసింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (2022-26) వ్యవసాయాన్ని ప్రాధాన్య రంగంగా గుర్తించింది. 2015లో ప్రారంభమైనప్పటి నుంచి జూన్ 30, 2025 వరకు పిఎంకేవివై  పథకం కింద 1.64 కోట్ల మందికి పైగా శిక్షణ పొందారు. 1.29 కోట్ల మందికి పైగా సర్టిఫికెట్లు లభించాయి. పిఎంకేవివై మాదిరిగానే సమీకృత ఉద్యాన పంటల అభివృద్ధి కార్యక్రమం, రాష్ట్రీయ గోకుల్ మిషన్, ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన వంటి ఆయా రంగాలకు ఉద్దేశించిన నిర్దిష్ట పథకాలలో కూడా రైతులు సామర్థ్యాన్ని పెంచడానికి ప్రత్యేక అంశాలు ఉన్నాయి. సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి పెట్టడం ద్వారా ప్రభుత్వం రైతులు మెరుగైన పద్ధతులను పాటించడమే కాకుండా వారిని వ్యవస్థాపకులుగా, వ్యవసాయ-వ్యాపారులుగా, గ్రామీణ అభివృద్ధికి కీలక చోదకులుగా సాధికారీకరిస్తోంది. ఈ ప్రయత్నాలన్నీ వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా నైపుణ్యం గల, స్వయం సమృద్ధ, పటిష్ట రైతు సమాజానికి పునాది వేస్తున్నాయి.

# ఆరోగ్య సంరక్షణలో కొత్త శకం




2018లో రాంచీలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) ప్రారంభం భారతదేశ ఆరోగ్య రంగంలో ఒక విప్లవాత్మక మలుపును సూచించింది. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా అందించడం, నగదు రహిత చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దేశవ్యాప్తంగా కాగిత రహిత వైద్య సేవలకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సందర్భంగా చెప్పిన మాటలు ఇంకా గుర్తుండిపోతాయి: "దేశంలో ఏ ఒక్కరూ ఆర్థిక స్తోమత లేని కారణంగా మంచి వైద్యం అందుకోలేకపోతున్నామని బాధపడకూడదు." ఈ లక్ష్యం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా నిజం కావడం ప్రారంభమైంది, ఇది భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పునర్నిర్మించే దిశగా ఒక మైలురాయిగా నిలిచింది.

## పీఎం-జేఏవై: ఒక ఆర్థిక భరోసా

ఆయుష్మాన్ భారత్ పీఎం-జేఏవై పథకం ద్వారా భారతదేశంలో ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఆర్థిక భారం గణనీయంగా తగ్గింది. గతంలో, దాదాపు పదేళ్ల క్రితం, ప్రజలు తమ వైద్య ఖర్చులను పూర్తిగా సొంత జేబుల నుంచి భరించేవారు. ఈ పథకం ద్వారా ఈ భారం బాగా తగ్గింది. ఆగస్టు 2025 నాటికి, 10.3 కోట్ల మందికి పైగా ఆస్పత్రుల్లో చేరడానికి అనుమతులు మంజూరయ్యాయి, మరియు రూ.1.48 లక్షల కోట్లకు పైగా నగదు రహిత చికిత్సలు అందించబడ్డాయి. ఈ పథకం ప్రజల ఆర్థిక భద్రతను కాపాడటమే కాకుండా, వారి జేబుల నుంచి ఖర్చు తగ్గించి, వైద్య సేవలను సులభతరం చేసింది.

## విస్తరణ -సమ్మిళితం

పీఎం-జేఏవై పథకం దాని లబ్ధిదారుల సంఖ్యను క్రమంగా విస్తరించింది. ప్రస్తుతం, దాదాపు 61 కోట్ల మంది ఈ పథకం పరిధిలో ఉన్నారు. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని, 2022లో లబ్ధిదారుల సంఖ్యను 12 కోట్ల కుటుంబాలకు పెంచారు. మార్చి 2024లో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వారి కుటుంబాలను కూడా ఈ పథకంలో చేర్చారు. అక్టోబర్ 2024 నుంచి, 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరినీ, వారి ఆదాయంతో సంబంధం లేకుండా, ఆయుష్మాన్ వయ వందన కార్డు ద్వారా ఈ పథకం కిందకు తీసుకొచ్చారు. అదనంగా, సుమారు కోటి మంది గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికులను కూడా ఈ పథకంలో చేర్చే ప్రక్రియ జరుగుతోంది. ఈ విస్తరణ ఆర్థిక భరోసాతో పాటు, వృద్ధులు మరియు క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలకు గౌరవం మరియు ఆత్మవిశ్వాసాన్ని కూడా అందించింది.

## ఆరోగ్య ఫలితాలలో మెరుగుదల

పీఎం-జేఏవై ఫలితంగా ఆరోగ్య ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయి. ప్రతిష్ఠాత్మక 'ల్యాన్సెట్' పత్రిక నిర్వహించిన అధ్యయనం ప్రకారం, ఈ పథకం లబ్ధిదారుల్లో క్యాన్సర్ నిర్ధారణ అయిన 30 రోజుల్లోనే చికిత్స ప్రారంభించే వారి సంఖ్య 90 శాతం పెరిగింది. ఆర్థిక అవరోధాలు తొలగిపోవడం వల్ల వేగవంతమైన వైద్య సేవలు



**జేపీ నడ్డా,**
**కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి**

అందుబాటులోకి వచ్చాయి. 2021-22 ఆర్థిక సర్వే ప్రకారం, ఈ పథకం అమలు చేసిన రాష్ట్రాల్లో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) మరియు ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు (యు5ఎంఆర్) గణనీయంగా తగ్గాయి. ఈ గణాంకాలు ఆయుష్మాన్ భారత్ యొక్క సానుకూల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

## ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం

ఆయుష్మాన్ భారత్ పథకం ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఉత్తమ ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా వైద్యం అందించే అవకాశాన్ని పేదలకు కల్పించింది. ఈ పథకంలో 32,913 ఆస్పత్రులు నమోదయ్యాయి, వీటిలో 15,103 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం ఆరోగ్య సేవలను విస్తరించడంలో కీలక పాత్ర పోషించింది. తక్కువ వైద్య సేవలు ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రత్యేక వైద్య సేవలు, ముఖ్యంగా క్యాన్సర్



చికిత్స, హృదయ శస్త్రచికిత్సలు, ఆర్థోపెడిక్ సంరక్షణ, ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా అందుబాటు లోకి వచ్చాయి, దీనివల్ల పేద కుటుంబాలకు అత్యుత్తమ వైద్యం చేరువైంది.

## డిజిటల్ ఆరోగ్య సంరక్షణకు ప్రోత్సాహం

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడంలో కూడా ముందంజలో ఉంది. అత్యాధునిక ఐటీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల గుర్తింపు, ఈ-క్లెయిమ్‌లు, అక్రమాల విశ్లేషణ ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందే సౌలభ్యం అందుబాటులోకి వచ్చాయి. ఈ డిజిటల్ వ్యవస్థ వల్ల అక్రమాలు కేవలం 0.33 శాతం మాత్రమే ఉన్నాయి, ఇది పథకం యొక్క పారదర్శకతను సూచిస్తుంది. ఫిర్యాదులను పరిష్కరించడానికి జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో మూడు అంచెల వ్యవస్థ ఏర్పాటు చేయబడింది, ఇది పథకం యొక్క విశ్వసనీయతను మరింత బలోపేతం చేసింది.

## ప్రధానమంత్రి దార్శనికత

ఆయుష్మాన్ భారత్ పథకం యొక్క విజయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క దార్శనికత ప్రధాన కారణం. 2016లో, కేంద్ర ఆరోగ్య మంత్రిగా ఉన్న సమయంలో, జెనీవాలో జరిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యనిర్వాహక మండలి





సమావేశంలో సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ గురించి చర్చలు జరిగాయి. భారత్ వంటి వైవిధ్యభరిత దేశంలో అందరికీ ఆరోగ్య సంరక్షణ అందించడం సాధ్యమేనా అని ఆలోచించిన సమయంలో, ప్రధానమంత్రి ఈదిశగా స్పష్టమైన మార్గదర్శనం అందించారు. ఆయన స్వయంగా పథకం యొక్క ప్రతి వివరాన్ని చర్చించి, అనేక రాత్రులు పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించారు. ప్రారంభించిన తర్వాత కూడా, ఆయన లబ్ధిదారుల సూచనల ఆధారంగా పథకంలో సవరణలు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

## సవాళ్లు - భవిష్యత్తు లక్ష్యాలు

ఏడు సంవత్సరాల తర్వాత, ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా పథకంగా నిలిచింది. అయితే, ఈ ప్రయాణం ఇంకా పూర్తి కాలేదు. పశ్చిమ బెంగాల్ ఈ పథకంలో చేరకపోవడం ఒక సవాలుగా మిగిలింది. ఈ రాష్ట్రం కూడా చేరితే, అక్కడి ప్రజలు కూడా ఈ పథకం యొక్క ప్రయోజనాలను పొందగలరు. తక్కువ సేవలు ఉన్న ప్రాంతాల్లో మరిన్ని ప్రైవేట్ ఆస్పత్రులను చేర్చడం, ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపరచడం అవసరం. అదనంగా, పథకాన్ని




ప్రాథమిక ఆరోగ్య సంరక్షణతో అనుసంధానం చేయడం, బలమైన రెఫరల్ వ్యవస్థలు, డిజిటల్ ఆరోగ్య రికార్డులు మరియు ఫాలో-అప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ముఖ్యమైన లక్ష్యాలు. క్లెయిమ్‌లను నిశితంగా పరిశీలించడం మరియు ఆస్పత్రులకు సకాలంలో చెల్లింపులు చేయడం వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.

## ఆరోగ్య భారత్ దిశగా

ఆయుష్మాన్ భారత్ పథకం భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఒక గొప్ప మార్పును తీసుకొచ్చింది. ఇది కేవలం ఆర్థిక భరోసా మాత్రమే కాకుండా, పేదలకు అత్యుత్తమ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలు మరియు సమ్మిళిత విధానం ఈ పథకాన్ని ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిపాయి. ప్రతి భారతీయుడికీ ఆదాయం లేదా భౌగోళిక ప్రాంతంతో సంబంధం లేకుండా మంచి వైద్యం అందించడమే ఈ పథకం యొక్క అంతిమ లక్ష్యం. ఈ దిశగా ప్రభుత్వం యొక్క సంకల్పం దృఢంగా ఉంది, రాబోయే సంవత్సరాలలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భారత్ యొక్క స్వప్నాన్ని సాకారం చేస్తుంది.

# భారతీయ దృష్టికోణంలో ఆర్థికాభివృద్ధి మార్గం



"భారతదేశంలోని మేధావులు ఆర్థికసమస్యల పరిష్కారం కోసం పశ్చిమదిక్కువైపు చూడడానికి ముఖ్య కారణం ఏమిటంటే 'భారతీయ సంస్కృతి ఆధ్యాత్మిక ప్రధానమైనది, భౌతికజీవితంపట్ల ఉదాసీనంగా ఉంటూవచ్చింది' అన్న భ్రమపూర్వకమైన భావనకులోను గావటం. ఇటువంటి భ్రమపూర్వకమైన భావన నిర్మాణంకావటానికి కారణం ఆధ్యాత్మికత అన్న మాటకు తప్పుడు అర్థం చెప్పుకొంటూ రావటమే. 'యతో అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధిః'

సధర్మః' అని ధర్మానికి నిర్వచనం. దేనివల్ల ఇహలోక, పరలోక ఉన్నతి లభిస్తుందో అది ధర్మము. ఇహలోక విషయాలను వదిలిపెట్టిన వారే పరలోక సుఖాలను పొందగల్గుతారని, కాబట్టి ఇహలోక విషయాలకు ప్రాధాన్యమివ్వరాదని చెప్పటం సరైనదికాదు. మన ధర్మం అలా బోధించలేదు. భౌతికత, ఆధ్యాత్మికత పరస్పరం వ్యతిరేకమైన భావాలనీ చెప్పలేదు. ఆధ్యాత్మికత అనేది ఒక దృష్టికోణాన్ని ప్రసాదిస్తుంది. దానిద్వారా మనం ఎదుర్కొనే అన్ని సమస్యలనూ విశ్లేషించుకోవచ్చు. ఆధ్యాత్మికత ఈ ప్రపంచాన్ని అర్థం చేసికొనడానికి ఒక విశిష్ట దృక్కోణాన్ని ప్రసాదిస్తున్నపుడు, దాని సహాయంతో ప్రపంచంలోని వివిధ సమస్యలను అర్థంచేసుకొని పరిష్కారాలను సాధించుకోలేమా?

భారతదేశం ఈ భౌతిక ప్రపంచాన్ని కూడా అధ్యయనం చేసింది. 'అర్థం' (సంపద) గురించికూడా ఆలోచించింది. 'సుఖస్య మూలం ధర్మః, ధర్మస్య మూలం అర్థ' అని ఆర్య చాణక్యుడు ప్రవచించాడు. సుఖం ధర్మం కారణంగా లభిస్తుంది. అర్థం ఉన్నపుడు ధర్మంగా వర్తించగల్గుతాం అని ఆయన వివరించాడు. ధర్మబద్ధమైన వ్యవహారం లేకుండా సుఖం లభించదు.

అర్థవిహీనమైన స్థితిలో ధర్మంగా ప్రవర్తించటం సులభంకాదు. విశ్వామిత్రుడు ఆకలితో నకనకలాడుతూ రాత్రిపూట ఒక చండాలుని ఇంట్లోకి దొంగతనంగా ప్రవేశించి, అక్కడ ఉన్న కుక్క మాంసాన్ని తిన్నాడని చెప్తారు. అంటే ధర్మానికి ఉండే ఎన్నో నియమాలను ఆయన ఉల్లంఘించాడు. అపద్ధర్మం అన్న పేరుపెట్టి శాస్త్రకారులు విశ్వామిత్రుని వ్యవహారాన్ని సమర్థిస్తారు. అర్థంలేకపోవటమే ఆపత్తికి కారణమైంది గదా, అటువంటి ఆపద సమాజంలో అందరికీ సంభవిస్తే, ఒకరి సొత్తు నొకరు దొంగిలించుకొంటూ, ఆపద్ధర్మం అని దానిని సమర్థించుకొంటూ ఉంటే, సమాజం నిలబడుతుందా? అంతటా కరవు, కాటకాలు తాండవిస్తున్నపుడు దొంగతనం చేయదగిన వస్తువులు ఉంటాయా?

అయితే, ఈ విధంగా లేమి ఏ విధంగా ధర్మనాశనానికి దారితీస్తుందో, కలిమి ఎక్కువకావటం కూడా ధర్మనాశనానికే దారితీస్తుంది. ఇది భారతదేశపు దృష్టికోణంలోని విశిష్టత. పాశ్చాత్యులు ఈ కోణంలో ఆలోచించలేదు. సంపద ద్వారా లభించే వస్తువులు ధనాన్ని పుష్కలంగా ఉండి, వాటిపై వ్యక్తులకు మితిమీరిన ఆసక్తి నిర్మాణమైనపుడు గురించిన ధ్యాస ఎక్కువై మనిషి దేశాన్ని, ధర్మాన్ని, జీవితంలోని నిజమైన ఆనందాన్ని అన్నింటినీ మరచిపోయి వ్యవహరిస్తాడు. ఈ విధంగా విషయలోలుడైన వ్యక్తి పౌరుషవిహీనుడై (గడ్డి కరవడానికి కూడా అలవాటుపడిపోయి) తనకు, సమాజానికి హాని కలిగించే పనులకు పాల్పడుతాడు. మొదటిదశలో జీవితంలోని లక్ష్యాలను సాధించుకొనడానికి అర్థం ఒక సాధనం' అన్న సత్యాన్ని విస్మరించి, ధనాన్ని కూడబెట్టటమే తన లక్ష్యం అనుకుంటాడు. రెండవదశలో ధర్మాచరణకు సాధనంగా మాత్రమే ధనాన్ని సమకూర్చుకోవాలన్న జ్ఞానాన్ని విస్మరించి విషయ భోగాలకోసం ధనాన్ని కూడబెట్టటం చేస్తూ ఉంటాడు. విషయ భోగాలను అనుభవించటంలో అంతెక్కడ ఉంటుంది? ఆ కృష్ణ ఎప్పటికీ తీరేది కాదు గదా! ఆ కారణాన ఎప్పుడు చూసినా – కావలసినంత ధనం సిద్ధంగా లేదన్న చింత పీడిస్తూ ఉంటుంది. దానితో పౌరుషాన్ని కోల్పోయిన ఆ వ్యక్తి అర్థోపార్జన సామర్థ్యాన్నికూడా క్రమంగా కోల్పోతాడు.

సమస్త వ్యవహారాలకు, వ్యక్తియొక్క ప్రతిష్ఠకూ అర్థమే కొలబద్ద అయినప్పుడు సమాజంలో 'సర్వే గుణాః కాంచన మాశ్రయన్తి' అన్నది లోకవ్యవహారంగా మారిపోతుంది.

(ఏ నరునకు విత్తము గల
దానరుడు కులీను దధికు దార్యుడతండే
ధీనిధి ధన్యుడు నేర్పరి
నానా గుణగణము కాంచనంబున నిలుచున్)

భర్తృహరి సుభాషితానికి ఏనుగు లక్ష్మణకవి అనువాదం

ఎప్పుడైతే కేవలం డబ్బుగలవారికే మానసమ్మానాలు, అధికారాలు, హక్కులు, పదవులూ లభించే స్థితి ఏర్పడుతుందో, అప్పుడు సమాజంలో అందరూ ధనపరాయణులై పోతారు. ఈ విధంగా సమాజంలో ధనపరాయణత పెరిగిపోయినపుడు చిన్నపనులకు కూడా ఎక్కువ ధనం అవసరమౌతుంటుంది. ధనప్రభావం పెరిగినకొద్దీ, ప్రతి ఒక్కరి జీవితంలోనూ లేమి విస్తరిస్తూ ఉంటుంది. ఈ కారణంచేతనే కలిమిని లేమిని కావడి కుండలుగా భావించి సమస్థాయిలో నిలబెట్టే ప్రయత్నం భారతదేశంలో జరిగింది. ఈ విధమైన సముచితమైన రీతిలో వ్యవస్థను నిర్వహించటాన్ని 'అర్థాయామమని పేర్కొన్నారు. డబ్బుతో కొనలేని



సామాజిక ప్రమాణాలకు పెద్దపీటవేసినపుడు అది సాధ్యపడుతుంది. దేశంకోసం ప్రాణాలర్పించే సైనికుడు డబ్బు కోసమని తన పరాక్రమాన్ని ఉపయోగించటంలేదు. ఒకవేళ డబ్బు సంపాదించే దృష్టి అతనికి కలిగినట్లయితే, అతడు దేశద్రోహి కాగల అవకాశాలే ఎక్కువగా ఉంటాయి. స్త్రీ తన శీలాన్ని కాపాడుకొంటూ ఉండటంలో ధనం ప్రసక్తి ఉండదు. వైద్యుడు రోగికి అందించే సేవలకు ఏ విధంగా వెలకట్టగలము? ప్రభుత్వోద్యోగి ఒక ఫైలును ముందుకు నడిపించటంలో అడుగడుగునా డబ్బుతో ముడిపెట్టుకొంటే ఏమవుతుంది? బలహీనులకు రక్షణ కల్పించ వలసిన బాధ్యతఉన్న రక్షకభటుడు తన సేవలకు విలువకట్టి ప్రతిఫలం చెల్లించుమని అడిగేటట్లయితే సమాజానికి రక్షకుడు కావడానికి బదులుగా అతడే సమాజానికి హానికారకుడవుతాడు గదా!

పరాక్రమాన్నిగాని, జ్ఞానాన్నిగాని, సేవాపరాయణతనుగాని, శ్రమశక్తినిగాని ఆయా వ్యక్తుల ద్వారా రూపొందింపబడే వస్తువులరూపంగానే కొలవటం సరైనదికాదు. ఈ విషయంలోనే పాశ్చాత్యుల దృష్టికి, మన దృష్టికి గల తేడా ఏమిటో మనకు అవగతమౌతుంది. పాశ్చాత్యుల ఆర్థిక దృక్కోణం మన దేశానికి వర్తించేది కాదని స్పష్టమౌతుంది – ఎందుకంటే వారి విలువలు వేఱు, మన విలువలు వేఱు – పాశ్చాత్యుల విలువలు ఆర్థికశాస్త్రంతో ముడి పడినవి కాగా, భారతీయుల విలువలు ధర్మంతో ముడిపడినవి.

అందువల్ల అభివృద్ధి సాధించడానికి భారతదేశం అనుసరించవలసిన మార్గం పాశ్చాత్యులు అనుసరించిన మార్గానికి భిన్నంగానే ఉంటుంది. అయితే పాశ్చాత్య ఆర్థికశాస్త్ర వేత్తలైన మార్క్సు, మార్షల్ మొదలైనవారి ప్రభావంలో చిక్కుకుని మనం బయటపడ లేకున్నాము. మన దేశంలో ప్రణాళికలన్నీ పాశ్చాత్య ఆర్థికనీతి ననుసరించే నడుస్తూ ఉన్నవి, గాంధేయ ఆర్థిక సిద్ధాంతాలు ఒక ఉద్యమరూపంలో మనముందుకు వచ్చినా, గాంధేయ వాదులు పాశ్చాత్య ఆర్థిక విధానంవల్ల సంభవించగల కీడు గురించి హెచ్చరించినా, వాటికి ప్రత్యామ్నాయం కాగల భారతీయ ఆర్థిక విధానాన్ని గుర్తించటంలో విఫలురైనారు. కాగా పాశ్చాత్య ఆర్థికవిధానాలను ప్రచారంచేయటంలో, అమలుచేయించటంలో నిహిత స్వార్థా లున్న ఆర్థికశాస్త్రవేత్తలకు మన దేశంలో కొదువలేదు. స్వాతంత్ర్యానంతరం కూడా, పాశ్చాత్య విధానాల ననుసరించే ప్రణాళికా రచనా సాగుతూ ఉండటంతో, సహజంగానే, భారతదేశ సామాన్య ప్రజానీకం దోపిడీకి గురవుతూఉండటం సాగిపోతూ ఉంది. మన పారిశ్రామిక వేత్తలు, నూతన పరిశ్రమల సంస్థాపకులు పాశ్చాత్యుల దోపిడీ విధానాలను కొనసాగిస్తూ ఉన్నారు. స్వదేశీ ఉద్యమం పేరున మన దేశంలో జరుగుతున్నదంతా ఖాదీటోపిధారణకు మాత్రమే పరిమితం!

## పంచవర్ష ప్రణాళికల డొల్లతనం

రెండవ పంచవర్ష ప్రణాళికను చర్చించుతూ దీనదయాళు ఉపాధ్యాయ ఇలా అన్నారు: "ఈ ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోని ప్రధాన అవలక్షణం అభారతీయమైనదిగా ఉండటం. భారతీయ సామాజిక వ్యవస్థలలోని మూలలక్షణాలను అది గ్రహించుకోలేదు. స్వావలంబన మన ప్రణాళికా రచనకు మూలస్తంభం కావాలి. ప్రపంచంలోని ఒక భాగంలో సాధ్యమైన పారిశ్రామిక అభివృద్ధిని మరోచోట బలవంతంగా రుద్ది, ఆశించిన ఫలితాలను పొందటం అసాధ్యం. మన వ్యవసాయం గురించి, మన పరిశ్రమల గురించి మనదైన అవగాహన, కల్పన మనకు ఉండాలి. మన దేశీయ పరిస్థితులకు అనుగుణమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకోవాలేగాని, పాశ్చాత్యుల పరిజ్ఞానాన్ని యథాతథంగా అమలుచేయటం కుదరదు. అందరికీ ఉపాధి నిచ్చేది, అంతరాలు తగ్గించేది అయిన సాంకేతిక పరిజ్ఞానం విధంగానైతేనే, మనం మనప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచ గలుగుతాం.

పాశ్చాత్యదేశాలలో ఇప్పుడు, ప్రవేశపెట్టబడుతున్న సాంకేతిక పరిజ్ఞానం మనకు కావాలి. ఆ దిశలోనే అడుగులు ముందుకు వేస్తున్నది. కాగా ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో పొందు పరచ బడినవన్నీ ఆర్థిక సంక్షోభానికి ముందునాటి సాంకేతిక పరిజ్ఞానము, ఆర్థిక విధానాలు (ఆర్గనైజరు–29 సెప్టెంబర్ 1958) –ఇవి మాత్రమే."

ప్రణాళికాసంఘం, జాతీయ అభివృద్ధిమండలి– వీటిని ఎవరితో నింపి రూపొం దిస్తున్నారో ఆ విధానాలనూ మార్చవలసిన అవసరమున్నదని ఈ వ్యాసంలో దీనదయాకు ఉపాధ్యాయ సూచించారు. ప్రణాళికా కాలవ్యవధిని విస్తరించాలి. అభివృద్ధిని గుర్తించే మణిలీలను మార్చాలి. ప్రణాళికలో ఎన్నో అభివృద్ధిపథకాలున్నాయి అవి ఒకదానితో ఒకటి విడ దీయరానివి. ఆ పథకాల సంఖ్యను కుదించటం హానికరము, అమలులో కష్టదాయకం కూడా. నిధులకొఱత కారణంగా చాలా సందర్భాలలో అభివృద్ధి ప్రాథమ్యాలను మార్చవలసి వస్తుంది. అటువంటి స్థితిలో అయిదేళ్ళలోనే అనుకొన్న లక్ష్యాలన్నీ సాధించు కోవటం సాధ్యపడదు. ఆర్థికాభివృద్ధి అనేది నిరంతరంగా సాగిస్తూ ఉండవలసిన ప్రగతి అటువంటి ప్రగతిని కచ్చితమైన కాలవ్యవధులకు పరిమితం చేయటం సరైనది కాదు. ♣♣♣

# అక్రమార్జన, చీకటి జీవోలే జగన్ చరిత్ర



## మీడియా సమావేశంలో నాగోతి రమేష్ నాయుడు ధ్వజం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలను, విషప్రచారాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. జగన్ తన హయాంలో చేసిన పాపాలను కప్పి పుచ్చుకోవడానికే, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాగోతి రమేష్ నాయుడు మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమేష్ నాయుడు మాట్లాడుతూ, జగన్ రాజకీయ చరిత్ర ఏమిటో రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా చిత్తూరు, కడప జిల్లా ప్రజలకు బాగా తెలుసని ఎద్దేవా చేశారు. "సారాయితో వ్యాపారం చేసిన చరిత్ర జగన్‌ది. ఎర్రచందనాన్ని అక్రమంగా విదేశాలకు తరలించిన కుటుంబం వారిది. జగన్ తన రాజకీయ జీవితంలో ఏనాడూ సొంత డబ్బులతో రాజకీయాలు చేయలేదు. కేవలం అక్రమార్జనతోనే చేశారు" అని రమేష్ నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్రం సర్వనాశనమైందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యంగా, కల్తీ మద్యం విధానాలపై రమేష్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "జగన్ రెడ్డి తెచ్చిన కల్తీ బ్రాండ్ల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబాల ఉసురు, వారి పాపం తగిలి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 11 సీట్లకు పరిమితమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి మళ్లీ పట్టాలెక్కుతోందని, ఇది చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. "విశాఖపట్నానికి గూగుల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ వస్తుంటే, దాని గురించి యావత్ ప్రపంచం చర్చించుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఈ అభివృద్ధిని చూడలేకే జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై పనిగట్టుకుని విషప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. జగన్ ఎన్నడూ నిజాయితీతో కూడిన రాజకీయాలు చేయలేదని, నకిలీ మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి గతంలో లబ్ధి పొందారని అన్నారు. "రాత్రికి రాత్రి చీకటి జీవోలు ఇచ్చి రాష్ట్రాన్ని, పాలనను నాశనం చేసిన వ్యక్తి జగన్" అని దుయ్యబట్టారు. వైసిపి చేసిన పాపాలు రోజుకొకటిగా ఇప్పుడు బయటకు వస్తున్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విమర్శలు చేస్తున్నారని అన్నారు. కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్న తరుణంలో, ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే జగన్ కొత్త నాటకాలకు తెరలేపారని రమేష్ నాయుడు ఆరోపించారు. అలాగే, వైద్య కళాశాలల ఏర్పాటు విషయంలో గత ప్రభుత్వం చేసిన అబద్ధాలను, ప్రస్తుత ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖచ్చితంగా తిప్పికొడతామని ఆయన స్పష్టం చేశారు.



# బీసీల్లో నకిలీలకు చెక్ పెట్టేందుకే కులగణన

## బీసీ సంఘాల నేతలతో భాజపా అధ్యక్షుడు మాధవ్



బడుగు, బలహీన వర్గాల హక్కులకు దశాబ్దాలుగా గండి కొడుతున్న నకిలీ ధృవీకరణ పత్రాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే కేంద్ర ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని చేపట్టిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. బీసీ జాబితాలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ రిజర్వేషన్ ఫలాలు సంపూర్ణంగా అందాలన్నదే భాజపా లక్ష్యమని, ఆ దిశగా బీసీలందరితో కలిసి నడుస్తామని ఆయన హామీ ఇచ్చారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో పలు బీసీ సంఘాల ప్రతినిధులు శ్రీ మాధవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు తాము క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా, కొందరు అనర్హులు నకిలీ బీసీ ధృవీకరణ పత్రాలను సృష్టించి, నిజమైన బీసీల ఉద్యోగ, విద్యా, రాజకీయ అవకాశాలను కొల్లగొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీసీల హక్కులకు ఏ విధంగా భంగం కలిగిందనే అంశాలను చారిత్రక ఉదాహరణలతో సహా వివరించారు. అనంతరం వారు, కేంద్రం తలపెట్టిన కుల గణనను అత్యంత పకడ్బందీగా, సక్రమంగా నిర్వహించాలని కోరారు. చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా పెంచాలని, బీసీల సంక్షేమానికి, బలోపేతానికి భాజపా పూర్తిస్థాయిలో చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### బీసీలు దేశానికి వెన్నెముక

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. "బీసీలు అంటే బలహీనవర్గాలు అనే పదానికే భాజపా వ్యతిరేకం. బీసీలు అంటే ఈ దేశానికి వెన్నెముక, వారు బలమైన వర్గం అన్నదే మా పార్టీ అభిప్రాయం" అని ఉద్ఘాటించారు. దేశం స్వాతంత్ర్యం పొంది వంద వసంతాలు పూర్తి చేసుకునే (అమృత కాలం) సమయానికి బీసీల జీవన విధానంలో సమూల మార్పు రావాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని మాధవ్ సూచించారు. "బీసీ కులాల్లో అత్యంత చిన్న కులాలకు, దశాబ్దాలుగా గుర్తింపునకు నోచుకోని వర్గాలకు కూడా ప్రాధాన్యత దక్కాలన్నదే ప్రధాని మోడీ అభిమతం. అందుకే దేశవ్యాప్తంగా 50 శాతానికి పైగా ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసేందుకు బీసీలకు టిక్కెట్లు ఇచ్చిన ఏకైక పార్టీ భాజపా మాత్రమే" అని ఆయన గుర్తు చేశారు. బీసీల అభివృద్ధి కోసం కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను, ఇటీవల నిర్వహించిన 'సృష్టి స్ఫూర్తి' వంటి కార్యక్రమాలను ఆయన వారి దృష్టికి తీసుకొచ్చారు. రానున్న రోజుల్లో బీసీ సంఘాలకు భాజపా మరింత చేరువగా ఉంటుందని, వారితో కలిసి నడుస్తుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, భాజపా ఐటీ సెల్ ఇన్చార్జి మకుటం శివ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, అన్నవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పప్పుధాన్యాల స్వయం సమృద్ధికి రూ.11,440 కోట్లు మంజూరు



## కేంద్రమంత్రి మండలి నిర్ణయాలు

2026-27 మార్కెటింగ్ సీజన్‌లో రబీ పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. దీని ద్వారా రైతులకు వారి ఉత్పత్తులకు తగిన ధరలు లభిస్తాయి. అత్యధికంగా కుసుమ పువ్వుకు క్వింటాలుకు రూ.600, కాయధాన్యాలు (లెంటిల్స్) (మసూర్) క్వింటాలుకు రూ.300 చొప్పున మద్దతు ధర పెంచారు. రాప్‌సీడ్, ఆవాలకు రూ.250, పప్పుధాన్యాలకు రూ.225, బార్లీకి రూ.170, గోధుమలకు రూ.160 చొప్పున పెంచారు. అక్టోబర్ 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రి మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు పప్పుధాన్యాల స్వయం సమృద్ధ కార్యక్రమం అమలుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపు సహా స్వావలంబన సాధించడమే ఈ వినూత్న కార్యక్రమం లక్ష్యం. దీన్ని 2025-26 నుంచి 2030-31 వరకూ రూ.11,440 కోట్ల అంచనా వ్యయంతో ఆరేళ్లపాటు అమలు చేస్తారు. భారతీయ పంటల సాగు వ్యవస్థలు, ఆహార పదార్థాల్లో పప్పుధాన్యాలకు ప్రత్యేక ప్రాధాన్యం. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పప్పుగింజల ఉత్పత్తిదారు మాత్రమేగాక వినియోగదారు కూడా. జీవన ప్రమాణాలతో పాటు ఆదాయాల పెరుగుదల కారణంగా దేశంలో వీటి వినియోగం కూడా పెరిగింది. డిమాండుకు తగిన ఉత్పత్తి లేనందువల్ల పప్పుగింజల దిగుమతి 15 నుంచి 20 శాతం దాకా పెరిగింది. దేశీయ డిమాండ్ తీర్చే దిశగా ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడం సహా రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆరేళ్లపాటు "పప్పుధాన్యాల స్వయంసమృద్ధ కార్యక్రమం" అమలు చేస్తామని ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించింది.

దేశవ్యాప్తంగా 2030-31 నాటికి పప్పుగింజల సాగు విస్తీర్ణాన్ని 310 లక్షల హెక్టార్లకు పెంచడంతోపాటు ఉత్పత్తిని 350 లక్షల టన్నులకు, దిగుబడిని హెక్టార్ కు 1130 కిలోలకు పెంపు ఈ కార్యక్రమ లక్ష్యాలు. ఇందు కోసం రైతులకు 126 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాలను పంపిణీ చేస్తారు. ఈ దిశగా రైతులకు 88 లక్షల విత్తన కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తారు. సుస్థిర పద్ధతులు, ఆధునిక సాంకేతికతలను ప్రోత్సహిస్తూ నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాలతో రైతులు, విత్తన సాగుదారుల సామర్థ్య వికాసానికి కృషి చేస్తారు. 'పీఎం-ఆశా' కింద ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) ప్రకారం ప్రధానంగా కంది, మినుము, సెనగ పంటలను గరిష్ఠ స్థాయిలో కొనుగోలు చేస్తారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే రాష్ట్రాల్లో తమతో ఒప్పందం కుదుర్చుకునే రైతుల నుంచి 'నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్' సంస్థలు నాలుగేళ్లపాటు 100 శాతం పంటను కొంటాయి.

### కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు

రానున్న తొమ్మిది సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల పెరుగుతున్న విద్యా అవసరాలను తీర్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. వీటి మొత్తం ఆర్థిక వ్యయం రూ.5,862.55 కోట్లుగా అంచనా. మంజూరైన మొత్తంలో రూ.2,585.52 కోట్లు మూలధన వ్యయం కోసం, రూ.3,277.03 కోట్లు కార్యాచరణ వ్యయం కోసం కేటాయించారు. మొదటిసారిగా అన్ని 57 కేంద్రీయ విద్యాలయాలను జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా, మూడు సంవత్సరాల ప్రాథమిక ప్రీ-ప్రైమరీ తరగతులైన బాలవాటికలను కలిగి ఉంటాయి. సమతుల్య ప్రాంతీయ కవరేజీపై దృష్టి సారించి, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ కొత్త కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. వాటిలో 20 కేంద్రీయ విద్యాలయాలు లేని జిల్లాల్లో, 14 ఆకాంక్షాత్మక జిల్లాల్లో, నాలుగు వామపక్ష తీవ్రవాదం ప్రభావిత ప్రాంతాల్లో, ఐదు ఈశాన్య, కొండ ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్నారు. హోం మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసిన ఏడు కేవీలను, రాష్ట్ర/యూటీ అధికారులు స్పాన్సర్ చేసిన 50 కేవీలను ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 4, తెలంగాణకు నాలుగు కొత్త కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. అవి మాంగసముద్రం (చిత్తూరు), బైరగనిపల్లె (కుప్పం మండలం, (చిత్తూరు), పలాస (శ్రీకాకుళం), శాఖమూరు (అమరావతి). తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం,

ములుగు, జగిత్యాల (చెల్గల్), వనపర్తి (నాగవరం శివారు) జిల్లాల్లో ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు ఇవి తోడుగా నిలవనున్నాయి. ఈ నిర్ణయం ద్వారా మారుమూల ప్రాంతాల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది.




## బీఆర్‌సీపీ మూడో దశకు ఆమోదం

బయోమెడికల్ రీసెర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ మూడో దశను కొనసాగించడానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని మూడో దశ (2025-26 నుంచి 2030-31 వరకు), అలాగే తరువాతి ఆరు సంవత్సరాల వరకు (2031-32 నుంచి 2037-38 వరకు) బయోటెక్నాలజీ విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, బ్రిటన్‌కు చెందిన వెల్‌కం ట్రస్ట్‌లతో పాటు ఎస్‌పీవీ, ఇండియా అలయన్స్‌ల భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు.
రూ.1500 కోట్ల మొత్తం వ్యయంతో 2030-31 వరకు అనుమతించిన ఫెలోషిప్, గ్రాంట్లను మంజూరు చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. దీనిలో రూ.1,000 కోట్లను డీబీటీ, రూ.500 కోట్లను యూకేకు చెందిన డబ్ల్యుటి సమకూరు-స్తాయి. ఈ కార్యక్రమం అత్యాధునిక బయోమెడికల్ రీసెర్చ్ కృషిలో అగ్రగామి శాస్త్రవేత్తలకు తోడ్పడుతుంది.

యూకేకు చెందిన వెల్‌కం ట్రస్టుతో డీబీటీ భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకొని 2008-2009లో బయోమెడికల్ రీసెర్చ్ కెరియర్ ప్రోగ్రామ్ బీఆర్‌సీపీని ప్రారంభించింది. దీనికోసం డీబీటీ, వెల్‌కం ట్రస్ట్ ఇండియా అలయన్స్ పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ ని ఏర్పాటు చేశారు. ఇది బయోమెడికల్ రీసెర్చ్‌లో ప్రపంచ శ్రేణి ప్రమాణాలను అందుకోవాలన్న లక్ష్యంతో భారత్‌లోనే రీసెర్చ్ ఫెలోషిప్పులను అందిస్తోంది. దీని తరువాత, విస్తారిత పోర్ట్‌ఫోలియోతో రెండో దశను 2018, 19లో అమలు చేశారు. మూడో దశలో, ఈ కింద పేర్కొన్న కార్యక్రమాలను అమలు చేయాలని ప్రతిపాదించారు:

1).మౌలిక, రోగ చికిత్సలకు సంబంధించిన (క్లినికల్), ప్రజారోగ్యం పరంగా ప్రారంభ కెరియర్, మధ్య స్థాయి రీసెర్చ్ ఫెలోషిప్పులు. ఇవి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించినవీ, ఒక శాస్త్రవేత్తకు పరిశోధన ప్రధాన కెరియర్లో మొదటి దశలకు ఉద్దేశించినవీ.

2). సహకార ప్రధాన గ్రాంట్ల కార్యక్రమం. భారత్‌లో పటిష్ఠ పరిశోధన ట్రాక్ రికార్డు కలిగి ఉన్న ప్రారంభ, మధ్య స్థాయి సీనియర్ స్థాయి కెరియర్ పరిశోధకుల కోసం ఉద్దేశించిన రెండు, మూడు పరిశోధక బృందాలకు కెరియర్ డెవలప్‌మెంట్ గ్రాంట్లు, కెటలిటిక్ కొలాబరేటివ్ గ్రాంట్లను అందించడం ఈ కార్యక్రమంలో భాగం.


3). ముఖ్య పరిశోధన ప్రయత్నాలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం. మూడో దశలో మెంటార్‌షిప్పు, నెట్‌వర్కింగ్, ప్రజలను భాగస్వాములను చేయడం.. వీటిని బలపరచడంతో పాటు కొత్త, నవోన్మేష జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్యాలను అభివృద్ధిప రుచుకోవడంపై కూడా దృష్టి పెడతారు.

ఒకటో దశ, రెండో దశలు భారత్‌ను అంతర్జాతీయ స్థాయి కలిగిన బయోమెడికల్ సైన్సుకు సరికొత్త కూడలిగా నిలిపాయి. విజ్ఞానశాస్త్రంలో భారత్ పెట్టుబడులను పెంచుతుండడంతోనూ, ప్రపంచ జ్ఞాన ప్రధాన ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర అంతకంతకూ పెరుగుతుండడంతోనూ వ్యూహాత్మక ప్రయత్నాల్లో ఒక కొత్త దశను ఆవిష్కరించాల్సిన అవసరం ఏర్పడింది. ఒకటో, రెండో దశలతో లభించిన ప్రయోజనాలను స్ఫూర్తిగా తీసుకొని, మూడో దశ ఇక జాతీయ ప్రాధాన్యాలతో పాటు ప్రపంచ ప్రమాణాలకు కూడా తులతూగే ప్రతిభావంతులకు అండదండలను అందించడం, సామర్థ్య సాధన, రూపాంతరణ (ట్రాన్స్‌లేషన్) ప్రక్రియలపై దృష్టి సారించనుంది.

## డీఏ, డీఆర్ పెంపు

ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం, పింఛనుదారులకు కరువు భృతిని ప్రస్తుతమున్న 55% రేటుకు మరో 3% పెంపును కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 01.07.2025 నుంచి దీనిని అమలు చేస్తారు. కరువు భత్యం, కరువు భృతి.. రెండింటి పెంపు వల్ల ఖజానాపై ఏటా రూ.10083.96 కోట్ల మేర అదనపు భారం పడుతుంది. ఈ పెంపు వల్ల సుమారు 49.19 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.72 లక్షల మంది పింఛనుదారులు లబ్ధి పొందుతారు. ఏడో కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ఆమోదించిన ఫార్ములా ప్రకారం DA, DR లను పెంచారు.

# కర్మయోగి పటేల్





**అమిత్ షా,**
**కేంద్ర హోం మంత్రి**

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తన ఆలోచనలను సాకారం చేయడానికి నిబద్ధతతో పనిచేసిన 'కర్మ యోగి'. సర్దార్ పటేల్ తన జీవితమంతా భారత దేశ స్వాతంత్ర్యం కోసం, సమైక్య భారతదేశాన్ని నిర్మించడానికి, నవ భారతదేశానికి పునాది వేయడానికి అంకితం చేశారు. సర్దార్ పటేల్ వారసత్వాన్ని కాంగ్రెస్ చాలా కాలం విస్మరించింది. ఆయనను భారతరత్నతో సత్కరించడానికి, సర్దార్ పటేల్ స్మారక చిహ్నన్ని నిర్మించడానికి ఆయన ఆలోచనలను అమలు చేయడం ద్వారా నవతరానికి స్ఫూర్తి కలిగించడానికి చాలా సంవత్సరాలు పట్టింది. సర్దార్ పటేల్ తన రచనల ద్వారా అజరామరుడు, అచంచలమైనవాడు. సర్దార్ సాహెబ్ దార్శనికత, వాస్తవికత కలగలిసిన వ్యక్తి. సర్దార్ పటేల్ ఆలోచనలు 19వ శతాబ్దంలో నాటివైనా అవి నేటికీ వర్తిస్తాయి. 3 లక్షలకు పైగా గ్రామాలకు చెందిన కోట్లమంది రైతుల వ్యవసాయ పనిముట్ల ఇనుమును కరిగించి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని తయారు చేయించారు ప్రధానమంత్రి మోదీ. దేశం మొత్తం కలలు ఈ విగ్రహంలో ప్రతిబింబిస్తాయి.

సర్దార్ పటేల్ క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించే ప్రాథమిక సిద్ధాంతాన్ని అనుసరించేవారు. ఆయన దేశంలో సహకార ఉద్యమాన్ని వ్యాప్తి చేయడానికి కృషి చేశారు. సర్దార్ అమూల్ విత్తనాలను నాటారని, పటేల్ ఆలోచనలు, మార్గదర్శకత్వం, ప్రేరణతో త్రిభువన్‌దాస్ పటేల్ జీ అమూల్‌ను స్థాపించారని చాలాతక్కువ మందికి మాత్రమే తెలుసు. 1920 నుంచి 1930 మధ్య కాలంలో దేశంలో రైతులపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా గళం విప్పిన పటేల్ సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని చూసి గాంధీజీ వల్లభాయ్‌కి 'సర్దార్' అని పేరు పెట్టారు. సర్దార్ పటేల్ కృషి వల్లే లక్షద్వీప్, అండమాన్– నికోబార్, జోధ్‌పూర్, జునాగఢ్, హైదరాబాద్ ఈ రోజు భారతదేశంలో భాగమై ఉన్నాయి. భారతమాతకు పట్టం కట్టిన సర్దార్ పటేల్ వల్లనే కాశ్మీర్ కూడా నేడు భారత్‌తో కలిసి ఉంది.

కాశ్మీర్‌లో చొరబడిన పాకిస్తాన్ దుండగులను మట్టికరిపించి, కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉండేలా చేయడానికే సర్దార్ పటేల్ సైన్యాన్ని జమ్మూ-కశ్మీర్‌కు పంపాలని నిర్ణయించుకున్నారు. సర్దార్ పటేల్ లేకుంటే భారతదేశ పటం ఈనాటిలా ఉండేది కాదు. స్వాతంత్ర్యం తరువాత సర్దార్ పటేల్ భారతదేశం నలుమూలల నుండి 500 కంటే ఎక్కువ సంస్థానాలు రాజులు– యువరాజులను సమీకరించటానికి శ్రమించారు. సర్దార్ పటేల్ అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ 500పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో కలపడానికి దేశవ్యాప్తంగా పర్యటించారు. స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పునాది వేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్విరామ కృషితోనే భారతదేశం ఏకమైంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు బ్రిటీష్ వారు భారత్‌ను వదిలివెళ్లిన వెంటనే భారతదేశం చిన్నాభిన్నం అవుతుందని, భారతీయ నాయకులకు సామర్థ్యం తక్కువ కాబట్టి వారు అధికారం కోసం కలహించుకుంటారని బ్రిటిష్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అన్నారు. కానీ సర్దార్ పటేల్ మొత్తం దేశాన్ని ఏకం చేశారు. నేడు భారతదేశం అదే బ్రిటన్‌ను వెనక్కు నెట్టి ప్రపంచంలో 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.
భారతదేశంలో ప్రజాస్వామ్యం 75 సంవత్సరాలలో లోతుగా వేళ్లూనుకుంది. దాని ఫలితంగా, స్వాతంత్ర్యం తర్వాత ప్రజలు శాంతియుతంగా ఓటు ద్వారా ఇచ్చిన తీర్పులను అందరూ ఆమోదించారు. దేశంలో ఎటువంటి రక్తపాతం లేకుండా నాయకత్వం చాలాసార్లు మారిపోయింది.

ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సంస్థానాలను ఏకం చేయడానికి అవిశ్రాంతంగా పనిచేశారు. అలాగే అఖిల భారత సర్వీసులకు, గూఢచార విభాగానికి పునాది వేశారు. కేంద్ర పోలీస్ బలగాల అవసరాన్ని గుర్తించారు. భారతీయతత్వానికి అనుగుణంగా పరిపాలనా సేవలను రూపొందించారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కృషి ఫలితంగానే భారతదేశంలో కేంద్ర–రాష్ట్ర వ్యవస్థ ఏ విధమైన ఘర్షణలు లేని విధంగా రూపొందింది. దాని ఫలితంగా నేడు కేంద్రం–రాష్ట్రాల మధ్య వైరుధ్యం లేదు. సర్దార్ పటేల్ అహింసా ధోరణి కూడా చాలా వాస్తవమైంది. ఆయన వ్యక్తిగత కీర్తి కోసం పాకులాడకుండా ప్రతి సమస్యకు పరిష్కారాలను కనుగొనడం ద్వారా ఫలితాలను తీసుకురావడానికి పనిచేశారు. ఒకవైపు జాతికి మహాత్మా గాంధీ ఆదర్శవంతమైన, ఆధ్యాత్మిక నాయకత్వం లభిస్తే, మరోవైపు సర్దార్ పటేల్ వంటి ఆచరణాత్మక, దూరదృష్టి, వాస్తవిక దృక్పథంగల నాయకుడి మద్దతు లభించింది. ఈ ఇద్దరి కలయిక భారత దేశానికి ఉపయోగపడింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో సర్దార్ పటేల్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బాబాసాహెబ్ డా. బీ.ఆర్.అంబేద్కర్‌కు రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యతను అప్పగించాలని ఆయనే సూచించారు. రాజ్యాంగం సమతుల్యంగా ఉండేలా సర్దార్ పటేల్ తన ఆలోచనలను అనేకసార్లు రాజ్యాంగ సభ ముందు ఉంచారు. దీని గురించి మరింత తెలుసుకోవడానికి, రాజ్యాంగం ఆత్మను అర్థం చేసుకోవడానికి సర్దార్ పటేల్, కే.ఎం. మున్షీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల మధ్య రాజ్యాంగ సభలో జరిగిన చర్చలను చదవాలి.

స్వాతంత్ర్యానంతరం 75 ఏళ్లు చాలా కష్టతరమైనవి. దేశం కొన్నిసార్లు యుద్ధాన్ని, కొన్నిసార్లు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆర్థిక సమస్యలను కూడా తట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఇన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి ద్వారా భారతదేశంలో ప్రజాస్వామ్యం పునాది మరింత బలోపేతం అయింది. ఆయన రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం దేశానికి మార్గనిర్దేశం చేశారు. దేశ భద్రతను కాపాడారు. దీని కారణంగా ప్రపంచంలో ఎవరూ భారతదేశ సైన్యాన్ని ఎదిరించే, సరిహద్దును అతిక్రమించే ధైర్యం చేయలేరు.





సర్దార్ పటేల్‌ను మరుగున పడవేయడానికి కొంత మంది ప్రయత్నం చేసినప్పటికీ సర్దార్ ఇప్పటికీ దేశంలోని ప్రతి వ్యక్తి మనస్సులో ఉన్నారు. ఎందుకంటే ఆయన ఆచరణాత్మక నాయకుడు. భారత్ కన్న బిడ్డ. భారతీయ సంస్కృతికి ప్రతీక. కీర్తి సంపాదించాలని ఎప్పుడూ కోరుకోలేదు. ఉక్కు మనిషి 'సర్దార్ పటేల్'. స్వాతంత్ర్యం వచ్చిన పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో అత్యధిక ఓట్లు తెచ్చుకున్న తర్వాత కూడా దేశ ప్రధాన మంత్రి పదవిని వదులుకున్నాడు. తద్వారా ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం వివాదాలకు దూరంగా ఉంది.

# విజయవాడ ఉత్సవ్‌తో కళాకారులకు గుర్తింపు : మాధవ్



అలనాటి సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం తోపాటు దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా విజయవాడ ఉత్సవ్ జరుగుతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలోని భవానిపురం పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తోన్న విజయవాడ ఉత్సవ్‌లో మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ అనేది కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం మాత్రమే కాదు మన సంప్రదాయాలను, మన గొప్ప వారసత్వాన్ని కొత్త తరాలకు పరిచయం చేసే వేదిక గా అభివర్ణించారు. గోదావరి, కృష్ణా తీరాలు మన సంస్కృతికి ప్రతీకలని, ఈ ఉత్సవ్ వల్ల దేశమంతటా విజయవాడకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి మార్గంలో దూసు కెళ్తాందని, అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి విజయవాడను ప్రపంచ పటంలో నిలపాలన్నారు. ఈ ఉత్సవాల ద్వారా స్థానిక కళాకారులకు, యువతకు, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని, పర్యాటక రంగం బలపడుతుందని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ నగరానికి మాత్రమే కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాంస్కృతిక ప్రతిష్టను తీసుకువస్తుందని పేర్కొన్నారు. విజయవాడ ప్రతిభను, స్థానిక కళాకారులను జాతీయస్థాయికి చేర్చే వేదికగా ఈ ఉత్సవ్ నిలుస్తోంది. సాంప్రదాయ కళలతోపాటు ఆధునిక ప్రతిభను ప్రోత్సహించే విధంగా ఈ ఉత్సవ్ రూపుదిద్దు కోవడం గర్వ కారణం అన్నారు. యువతలో సృజనాత్మకతను వెలికి తీయడంలో ఇలాంటి ఉత్సవాలు పెద్ద పాత్ర పోషిస్తాయని వివరించారు. విజయవాడను ప్రపంచ సాంస్కృతిక పటంలో నిలబెట్టే దిశగా ఈ ఉత్సవ్ తోడ్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, రాజ్యసభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వసంత కృష్ణ ప్రసాద్ ఎమ్మెల్సీ అలపాటి రాజా, కేడీసీసీ చైర్మన్ నెటెం రఘురాం మాజీ హెూం శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావుతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు సినీ రాజకీయ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.





భాజపా ఆధ్వర్యంలో నిర్వ హించనున్న ముండా జయంతి వేడుకలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ ఆహ్వానించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఆదివాసీ యోధుడిపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాసిన 'భగవాన్ బిర్సా ముండా' పుస్త కంతోపాటు.. స్వాతంత్ర్య యోధుల జీవితాలపై భారత భారతి సంస్థ ప్రచురిం చిన 175 పుస్తకాలను ఆయనకు అందజేశారు. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్లో భాగంగా 'ప్రతి ఇంటా స్వదేశీ - ఇంటింటా స్వదేశీ' డోర్ స్టిక్కర్ ను పవన్ కల్యాణ్ చేతుల మీదుగా విడుదల చేశారు.



Declaration : Rc.(A11)A9/150-11/2023 RNI.NO.70770I1999.




Published and Printed by NOOKALA MADHUKAR on behalf of Bharateeya Janata Party and Printed at
Kala Jyothi Process Pvt Ltd, Nidumukkula Village, Guntur -522016, Andhra Pradesh , A.P. Editor : VAMARAJU
SREE SATYA MURTHY Phone: 0866-2441135, 9494949059. Email.kamalavani2017@gmail.com